Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 279 మేడ్చల్ మల్కాజ్‌గిరి 28 అక్టోబర్ 2023 శనివారం పేజీలు : 4

### 'పాన్' లేకుండా నగదు బట్వాడా బ్యాంకులకు కొత్త నిబంధన

చెన్నై : పాన్‌కార్డు లేని వారి నుంచి, స్వీయ వివరాలు సేకరించిన తర్వాతే నగదు పరివర్తనకు అనుమతించాలని బ్యాంకులకు ఆదా యపన్ను శాఖ తెలియజేసింది. ఒకసారి రూ. 50 వేలు, అంతకు పైగా నగదు పరివర్తన చేపట్టే వారి నుంచి పాన్ కార్డు నెంబరు స్వీకరించి బ్యాంకు ఉద్యోగులు నగదు బట్వాడా చేపడుతున్నారు. అదే సమయంలో రూ. 50 వేలకు పైగా నేరుగా నగదు బట్వాడా చేయవద్దనే ఉత్తర్వులు అమలులో ఉన్నాయి. ఈ క్రమంలో, పలు బ్యాంకులు తమ వినియోగదారుల నుంచి పాన్ లేకుండా రూ. 50 వేలకు పైగా నగదు నేరుగా బట్వాడా చేస్తున్నాయి. ఈ విషయంపై దృష్టి సారించిన ఆదాయపన్ను శాఖ, పాన్ లేని వినియోగదారుల ఆధార్ నెంబరు, బ్యాంక్ ఖాతా నెంబరు, చిరునామా, రిజిస్టర్ మొబైల్ నెంబరు తదితర స్వీయ వివరాలు సేకరించిన తర్వాతే నేరుగా నగదు బట్వాడాకు అనుమతించవచ్చని పేర్కొంది.

# కాంగ్రెసోళ్లు అబద్దాలు చెబుతున్నారు

## వర్ధన్నపేట రింగ్ రోడ్డుకు పూలింగ్ లేదు.. బీలింగ్ లేదు.. స్పష్టం చేసిన సీఎం కేసీఆర్



వరంగల్ : ఎన్నికల్లో గెలవడానికి కొంతమంది దుర్మార్గులు పచ్చి అబద్దాలు చెబుతున్నారని ముఖ్యమంత్రి కేసీఆర్ మండిపడ్డారు. వర్ధన్నపేట రింగ్ రోడ్డు కోసం ల్యాండ్ పూలింగ్ చేస్తారని పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్నారు. ఆరూరి రమేశ్‌పై నేరుగా గెలిచే దమ్ము లేనోళ్లు ఈ ప్రచారాలు చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నేను హామీ ఇస్తున్నా. ఆ రింగ్ రోడ్డుకు పూలింగ్ బీలింగ్ లేదు. ఏమీ ఉండదు. ఎవరి జాగల నష్టం జరగదు. ఇది నామాట అని మనవి చేస్తున్నా. ఓటు వేసే ముందు ఆగం కావొద్దు.. ఆలోచించి ఓటేయాలి అని వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు కేసీఆర్ పిలుపునిచ్చారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు.

ఈ రోజు మళ్లీ ఎన్నికలు వచ్చాయి.. తెలంగాణ రాష్ట్రంలో మూడోసారి ఎన్నికలు జరుగుతున్నాయని కేసీఆర్ తెలిపారు. 24 ఏండ్ల క్రితం తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించిన రోజు ఎవరికీ కూడా నమ్మకం లేదు. చాలా అవమానాలు, అవహేళన చేశారు. మనతో పొత్తు పెట్టుకుని గెలిచి 14 ఏండ్లు ఏడిపించి, యువకుల చావులు చూసి, నేను చావు నోట్లో తలకాయపెట్టి ఆమరణ దీక్ష చేస్తే, అప్పుడు దిగి వచ్చి రాష్ట్రం ఇచ్చారని కేసీఆర్ గుర్తు చేశారు.

**అందరికీ న్యాయం చేసే దిశగా ముందుకు పోయాం..** సంసారాన్ని చక్కదిద్దకుకున్నట్లు ఒక్కో పనిని పరిష్కరించుకుంటూ ముందుకు పోతున్నాం అని కేసీఆర్ తెలిపారు. పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని వర్గాలను కాపాడుకుంటున్నాం. ఏ కులాన్ని, వర్గాన్ని వదిలిపెట్టకుండా.. అందరికీ న్యాయం చేసే దిశగా ముందుకు పోయాం. కరెంట్, సాగు, తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కారం చేసుకున్నాం అని కేసీఆర్ పేర్కొన్నారు.

**రూ. 160 కోట్లతో వర్ధన్నపేట అన్నివిధాలా అభివృద్ధి..** ఇవాళ కొంత మంది నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు అని కేసీఆర్ ధ్వజమెత్తారు. వాళ్లకు తెలంగాణ మీద అధికారం, పెత్తనం కావాలి. ప్రజల సంక్షేమం, బాధలు పట్టలేదు. 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ హయాంలో కరెంట్, ఎరువుల పరిస్థితి ఎలా ఉండేనో మీకు తెలుసు. ఆరూరి రమేశ్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట అన్ని రంగాల్లో బ్రహ్మాండమైన అభివృద్ధి సాధించింది. ఎస్సారెస్పీ కాలువల్లో చెట్లు మొలిచి ఉండే. ఆరూరి రమేశ్ నాయకత్వంలో ఆ కాలువలన్నింటినీ బాగు చేసుకున్నాం. నీళ్లు తెచ్చుకుని పంటలు పండించుకుంటున్నాం. ఐనవోలు, హసన్‌పర్తి మండలాలకు దేవాదుల నుంచి నీళ్లు తెచ్చుకుని పండటలు పండించుకుటున్నాం. రూ. 160 కోట్లతో వర్ధన్నపేట పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకున్నామని కేసీఆర్ తెలిపారు.

**ఉత్తకుమార్ రెడ్డి రైతుబంధు వేస్ట్ అంటున్నడు.. పీసీసీ అధ్యక్షుడు మూడుగంటల కరెంటు చాలంటున్నడు.. : సీఎం కేసీఆర్ –** ఉత్తకుమార్ రెడ్డి రైతుబంధు వేస్ట్ అంటున్నాడని.. పీసీసీ అధ్యక్షుడు 24 గంటల కరెంటు ఇచ్చి వేస్ట్ చేస్తున్నాడని సీఎం కేసీఆర్ అన్నారు. పాలేరులో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న సీఎం కేసీఆర్.. రైతుబంధు ఉండాలా వద్దా..? 24 గంటల కరెంటు కావాలా వద్దా? అంటూ ప్రజలను కేసీఆర్ ప్రశ్నించారు.

ఈ సందర్భంగా జనం రైతుబంధు ఉండాలి.. 24 గంటల కరెంటు కావాలంటూ నినదించారు.. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో పార్టీల వైఖరులను చూడాలి. ఏం మాట్లాడుతున్నారు కాంగ్రెస్ నేతలు.

మాజీ పీపీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఉవాచ. రైతుబంధు దుమారటన. రైతుబంధు వేస్ట్ అట. విలువైన ప్రజల పన్నులు కేసీఆర్ చెడగొడుతున్నడట. రైతుబంధు దుబారనా? రైతుబంధు ఉండాలా?' అంటూ సీఎం కేసీఆర్ ప్రజలను ప్రశ్నించారు. రైతుబంధు ఉండాలి అంటూ జనం నినదించారు.

**ఇదీ కాంగ్రెస్ నేతల వైఖరి..** 'ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు 24 గంటల కరెంటు ఇచ్చి కేసీఆర్ వేస్ట్ చేస్తున్నడు.. మూడు గంటలు సరిపోతుందా? ఎన్ని గంటల కరెంటు కావాలి?' అంటూ సీఎం కేసీఆర్ ప్రజలను ప్రశ్నించారు. ఈ సందర్భంగా సభకు హాజరైన అశేష జనవాణి మాకు 24 గంటలు కావాలి' అంటూ నినదించారు. 'నేను ఎక్కడ అడిగినా తెలంగాణ నలుమూలలో ఇదేవిధంగా ప్రజలు చెబుతున్నారు. కానీ, కాంగ్రెస్ నేతల వైఖరి రైతుబంధు వేస్ట్.. ఇవ్వద్దు కానీ మనం పంచుకొని తినాలి. 24 గంటల కరెంటివ్వద్దు.. మనం హైదరాబాద్‌లో ఏసీలో ఉండాలి.. ఇదీ వారి నీతి. పొరపాటున కాంగ్రెస్ గెలిస్తే ఏం జరుగుతుంది ? రైతుబంధుకు రాంరాం.. దళితబంధుకు జై భీమ్. కరెంటు కాటకలుస్తది.. కైలాసం వైకుంఠపాళి ఆటలో పెద్ద పాము మింగినట్లయితది. మళ్లీ మొదటికి పరిస్థితి వస్తుంది. ఏ గతి కావాలో ప్రజలు నిర్ణయం చేయాలి' అని పిలుపునిచ్చారు.

## కేసీఆర్‌ను ఓడగొట్టే మొగోడు రేవంత్ రెడ్డే




జగిత్యాల: ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ తిన్న సొమ్ము అంతా కక్కిస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కేసీఆర్ కటాకటాల్లోకే అని అన్నారు. చైనా లాంటి దేశాల్లో ప్రాజెక్టులు కుంగితే ఉరి తీసేవారని చెప్పుకొచ్చారు. ఈఎన్సీ మురళిధర్ రావుకు సర్టిఫికెట్ ఎవడు ఇచ్చాడో తెలియదన్నారు. మురళీధర్ రావుకు కనీస జ్ఞానం ఉందా అని ప్రశ్నించారు. దొర సంతకం పెట్టమనగానే పెడుతావా.. మురళి దర్ రావు ను జైల్లో వేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి కామారెడ్డిలో పోటీ చేస్తే.. కాంగ్రెస్ మొదట గెలిచే సీటు అదే అని.. కేసీఆర్‌ను ఓడగొట్టే మొగోడు రేవంత్ రెడ్డే అని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.




## బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ నేతను సీఎం చేస్తాం

సూర్యాపేట: టీ.బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ నేతను సీఎం చేస్తామని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం నాడు సూర్యాపేటలో బీజేపీ జనగర్జన సభ నిర్వహించింది. ఈ సభలో అమిత్ షా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. "దళితుడిని సీఎం చేస్తామని చెప్పే ధైర్యం కేసీఆర్‌కు ఉందా? బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం. బీజేపీని గెలిపిస్తే బీసీ నేతను సీఎం చేస్తాం. తెలంగాణకు BRS, కాంగ్రెస్ చేసిందేమీ లేదు. BRS, కాంగ్రెస్‌కు కుటుంబ రాజకీయాలే ముఖ్యం. కేటీఆర్‌ను సీఎం చేయడమే కేసీఆర్ లక్ష్యం. రాహుల్‌గాంధీను పీఎం చేయడమే సోనియా లక్ష్యం. బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం" అని అమిత్‌షా తెలిపారు.




## సునీల్ కనుగోలు సర్వేలో కాంగ్రెస్‌కి వచ్చే సీట్లు ఇవే...!

## తెలంగాణలో అధికారం దిశగా కాంగ్రెస్!!

హైదరాబాద్ : సునీల్ కనుగోలు తెలంగాణాలో కాంగ్రెస్ కి అధికారం దక్కించే పనిలో ఉన్నారు. ఈ వ్యూహకర్త సక్సెస్ ఫుల్ గా కాంగ్రెస్ ని ప్రజలతో కనెక్ట్ చేస్తున్నారు. రెండు సార్లు తెలంగాణాలో గెలిచి మూడవసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని భావిస్తున్న బీయారెస్ కి చుక్కలు చూపించేలా కాంగ్రెస్ ని రెడీ చేస్తున్నారు. ఇక సునీల్ కనుగోలు కి కొత్త ఇమేజ్ కూడా ఉంది. కర్నాటకలో కొద్ది నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ని గెలిపించిన వ్యూహాలు ఆయన సొంతం. ఇపుడు తెలంగాణా కాంగ్రెస్ కి రాజకీయ వ్యూహకర్తగా కీలకమైన బాధ్యతలను ఆయన సమర్ధంగా నిర్వహిస్తున్నారు. ఈసారి తెలంగాణాలో కాంగ్రెస్ కచ్చితంగా అధికారంలోకి రావాలని సునిల్ కనుగోలు గట్టిగానే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణా కాంగ్రెస్ లో చేరికలు అన్నీ కూడా ఆయనే స్వయంగా చూస్తున్నారు అని అంటున్నారు. అంతే కాదు ఎక్కడ ఎవరు పోటీ చేయాలి, చేస్తే ఎవరు గెలిచేది అన్నది కూడా సునీల్ కనుగోలే చూస్తున్నారు. ఇక బీజేపీ నుంచి కాంగ్రెస్ లోకి వచ్చి సీట్లు గ్యారంటీ చేసుకున్న వారి విషయంలో కూడా సునీల్ కనుగోలు వ్యూహాలే పనిచేస్తున్నాయని అంటున్నారు. ఇలా జంప్ అవుతున్న నాయకులు అంతా సునీల్ కనుగోలు తో చర్చలు జరిపి ఆ మీదటనే కాంగ్రెస్ లోకి వస్తున్నారు అని తెలుస్తోంది. వారు సునీల్ తో మాట్లాడి మాత్రమే తమ సీట్లు డిసైడ్ చేసుకుంటున్నారు అని అంటున్నారు. ఇక లేటెస్ట్ గా బీజేపీ నుంచి కాంగ్రెస్ లోకి జంప్ చేసిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విషయం తీసుకుంటే ఆయన సునీల్ కనుగోలుతో దాదాపుగా ఏడు గంటల పాటు చర్చలు జరిపారు అని అంటున్నారు. ఈ చర్చలలో కాంగ్రెస్ కి తెలంగాణాలో ఎన్ని సీట్లు కచ్చితంగా వస్తాయో కూడా సునీల్ కనుగోలు వివరించారని అంటున్నారు. ఆ తరువాత మాత్రమే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఒప్పుకుని కాంగ్రెస్ లో చేరారు అని అంటున్నారు. ఇక సునీల్ కనుగోలు రాజగోపాల్ రెడ్డికి చెప్పిన దాని ప్రకారం చూస్తే 51 సీట్లలో కాంగ్రెస్‌కి క్లీన్ ఎడ్జ్ ఉందని అంటున్నారు. అంతే కాదు మరో 12 సీట్లలో రెండవ స్థానంలో కాంగ్రెస్ ఉందని కూడా వివరించారని చెబుతున్నారు. అది కూడా చాలా తక్కువ తేడాతో కాంగ్రెస్ ఉంది అని కూడా పేర్కొన్నారట. ఇంకా ఎన్నికలకు టైం నాలుగు వారాలు ఉంది కాబట్టి అవి కూడా కచ్చితంగా అటు నుంచి ఇటు మారుతాయని కూడా సునీల్ కనుగోలు చెప్పుకొచ్చారని అంటున్నారు. ఈ లెక్క తీసుకుంటే ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ కి డెబ్బై సీట్లు ఎపుడూ తక్కువ కాకుండా వస్తాయని అంటున్నారు. ఇక బీజేపీ నుంచి కాంగ్రెస్ లోకి రావాలనుకునే నేతలలో కూడా ఎన్నికల టైం కి కొంత మార్పు వస్తుందని కూడా సునీల్ కనుగోలు అంచనా వేస్తున్నారని అంటున్నారు. అలా కాంగ్రెస్ కి బ్రహ్మాండమైన మెజారిటీతో సీట్లు దక్కబోతున్నాయని సునీల్ అంచనా వేస్తున్నారు అని అంటున్నారు. సునీల్ లెక్క ప్రకారం అయితే 70 సీట్ల దాకా అంచనా వేస్తున్నారని అవే టార్గెట్ గా పెట్టుకున్నారని అంటున్నారు. ఇలా పక్కా లెక్కలతో సునీల్ కనుగోలు తెలంగాణా కాంగ్రెస్ ని అధికారంలోకి తీసుకుని రావాలని చూస్తున్నారు. దాంతో పాటు ఎక్కడెక్కడ బలంగా ఉన్న లీడర్స్ ఇతర పార్టీలలో ఉన్నారు, వారిని తీసుకుని రావడం వల్ల డ్యాం ష్యూర్ గా ఆయా సీట్లు పార్టీకి దక్కుతాయని కూడా ఆలోచించి మరీ ఆ దిశగా ఆపరేషన్ చేస్తున్నారు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే సునీల్ కనుగోలు కాంగ్రెస్‌కి తెలంగాణాలో కొత్త ఆక్సిజన్ ఎక్కిస్తూ ఈసారి అధికారం లోకి తీసుకుని వచ్చేందుకు తనదైన ఎన్నికల స్ట్రాటజీస్ ని రెడీ చేస్తున్నారు అని అంటున్నారు. మరి సునీల్ వలలో మరెంతమంది మజీ కాంగ్రెస్ నేతలైన ప్రస్తుత బీజేపీ నేతలు ఉన్నారో అన్న చర్చ కూడా నడుస్తోంది.

# సంపాదకీయం

## షర్మిల రాజకీయ ప్రస్థానం ఖేల్ ఖతమేనా?

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమైన సంగతి తెలిసిందే. నవంబర్ 30న తెలంగాణలో ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే అధికార బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించేసింది. కాంగ్రెస్, బీజేపీ కూడా తమ తొలి విడత అభ్యర్థులను ప్రకటించాయి. రెండో విడత జాబితాల విడుదలకు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఇక తెలంగాణలో రాజన్న రాజ్యం తెస్తానని వైఎస్ షర్మిల వైఎస్సార్ తెలంగాణ పార్టీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కాలికి బలపం కట్టుకుని 4 వేల కిలోమీటర్లకు పైగా పాదయాత్ర చేసినా ఒక్కరంటే ఒక్క పేరున్న నేత కూడా పార్టీలో చేరలేదు. మరోవైపు కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయడానికి షర్మిల చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తెలంగాణ కాంగ్రెస్ లో కీలక నేతలు అడ్డుపుల్ల వేయడంతో షర్మిల పార్టీ విలీనం సాధ్యపడలేదు. ఢిల్లీ వెళ్లి సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను కలిసి వచ్చినా ప్రయోజనం దక్కలేదు. దీంతో వైఎస్ షర్మిల దాదాపు ఇక ఒంటరి పోరుకే సిద్ధమవుతున్నారు. అయితే ఈసారి షర్మిలతో పాటు ఆమె తల్లి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి భార్య వైఎస్ విజయమ్మ కూడా పోటీ చేస్తారని టాక్ నడుస్తోంది. ఈ విషయాన్ని స్వయంగా షర్మిల సైతం ప్రకటించారు. అవసరమైతే తనతో పాటు వైఎస్ విజయమ్మ, అనిల్ సైతం పోటీ చేస్తారని ఇప్పటికే చెప్పారు. కాగా 2009లో వైఎస్సార్ మరణించాక పులివెందుల ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ తరఫున విజయమ్మ గెలుపొందారు. 2011లో వైఎస్ జగన్, వైఎస్ విజయమ్మ తమ ఎమ్మెల్యే, ఎంపీ పదవులకు రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీని ఏర్పాటు చేశారు. ఆ పార్టీ తరఫున 2012లో కడప ఎంపీ స్థానం నుంచి వైఎస్ జగన్, పులివెందుల అసెంబ్లీ స్థానం నుంచి విజయమ్మ పోటీ చేసి ఘనవిజయం సాధించారు. ఇక 2014లో ఎన్నికల్లో విశాఖపట్నం ఎంపీ స్థానం నుంచి వైసీపీ తరఫున పోటీ చేసిన విజయమ్మ బీజేపీ అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత ఇక ఆమె ఎన్నికల్లో పోటీ చేయలేదు. తెలంగాణలో ఆమె కూతురు షర్మిల.. వైఎస్సార్ టీపీ పెట్టిన తర్వాత విజయమ్మ వైసీపీ గౌరవాధ్యక్షురాలు పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచీ విజయలక్ష్మి తెలంగాణలో షర్మిలకు అవసరమైన సహకారం అందిస్తూ వస్తున్నారు. మరోవైపు వైఎస్ షర్మిల ఇంతవరకు ఎన్నికల్లో పోటీ చేయలేదు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలోని ఖమ్మం జిల్లా పాలేరు నుంచి షర్మిల పోటీ చేస్తారని ఇప్పటిదాకా వార్తలు వచ్చాయి. అయితే పాలేరు నుంచి తన తల్లి విజయమ్మను పోటీ చేయిస్తారని తాజాగా టాక్ నడుస్తోంది. ఇక షర్మిల మిర్యాలగూడ నుంచి పోటీ చేస్తారని చెబుతున్నారు. ఈ మేరకు వైఎస్సార్ టీపీ కార్యవర్గ సమావేశంలో ప్రకటిస్తారని అంటున్నారు. పాలేరు, మిర్యాలగూడ సహా మొత్తం 15 నియోజకవర్గాల్లో వైఎస్సార్ టీపీ బరిలోకి దిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. కాంగ్రెస్ తో విలీనం కొలిక్కి రాకపోవడంతో షర్మిల తెలంగాణలో అన్ని స్థానాల్లో పోటీ చేయాలని భావించినట్టు సమాచారం. అయితే అభ్యర్థుల కొరతతో చివరకు 15 నియోజకవర్గాల్లోనే నిర్ణయించినట్టు తెలుస్తోంది. పార్టీ పునరుజ్జీవం కోసం తన తల్లి వైఎస్ విజయమ్మను మళ్లీ ఎన్నికల రంగంలోకి దించనున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పాలేరు నుంచి తన తల్లి విజయమ్మను బరిలో దించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. తాను మిర్యాలగూడ నుంచి పోటీ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. అలాగే మరో 13 అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. అయితే అన్ని పార్టీలు ఇప్పటికే అభ్యర్థుల జాబితాలను ప్రకటించినా వైఎస్సార్ టీపీ మాత్రం ఆలూ లేదు.. చూలూ లేదన్నట్టే పరిస్థితి ఉంది. ఇప్పటివరకు ఒక్క అభ్యర్థిని కూడా ప్రకటించలేదు. మేనిఫెస్టో ఊసూ లేదు. మరోవైపు ఏపీలో ఓడిపోయిన విజయమ్మను తెలంగాణలో గెలిపిస్తారని అనుకోవడం కూడా అత్యాశేనని అంటున్నారు. చివరకు షర్మిల అనుకున్న 15 సీట్లలో కూడా పోటీ కష్టమేనని చెబుతున్నారు. ఆమె పోటీ కూడా సందేహాస్పదమేనని పేర్కొంటున్నారు. షర్మిల కూడా పోటీ చేయకపోతే తెలంగాణలో ఆమె రాజకీయ ప్రస్థానం ముగిసినట్టేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఇక లెక్క పక్కాగా!



కొత్తగూడెం: గ్రామ పంచాయతీలకు వచ్చే ఆదాయాన్ని ఇక పక్కాగా లెక్కించనున్నారు. ప్రజలు పన్నులు సకాలంలో చెల్లిస్తున్నారా? లేదా? వాటికి సంబంధించిన లెక్కల విషయంలో ఇకపై ఎలాంటి గందరగోళం ఉండదు. గ్రామ పంచాయతీలను బలోపేతం చేయటానికి, డిజిటల్ పరంగా మరింత ముందుకు తీసుకెళ్లడానికి ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపుతున్నాయి. పంచాయతీల్లో ప్రధానంగా పన్నులను ప్రజలు నగదు రూపంలో చెల్లిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానంలో మార్పుల కారణంగా ఈ రోజుల్లో కూరగాయలు మొదలుకొని ఇతర వస్తువుల కొనుగోలుకు స్మార్ట్‌ఫోన్ ద్వారా యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) సేవలను వినియోగిస్తున్నారు. పంచాయతీల్లోనూ యూపీఐ సేవలు అందించేందుకు కేంద్రం నిర్ణయించింది. ఈ విధానం ఆగస్టు 15 నుంచి అన్ని పంచాయతీల్లో అమలుకానున్నట్లు తెలుస్తోంది.

**పారదర్శకంగా పన్నుల వివరాలు**

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఇప్పటికే కొన్ని మేజర్ పంచాయతీల్లో 'ఆన్‌లైన్ పేమెంట్స్' వినియోగంలో ఉన్నాయి. చాలా పంచాయతీల్లో పన్నుల వసూలు మాత్రం ఇప్పటికీ నగదు రూపంలోనే జరుగుతోంది. వసూలైన నగదును వివిధ అభివృద్ధి పనుల పేరిట పద్దులు రాసి పక్కదారి పట్టించే అవకాశం ఉంది. తాజాగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల ఇకముందు పన్నుల వసూలు, పత్రాల జారీ వంటివి యూపీఐ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. పంచాయతీ వ్యవస్థ పారదర్శకం కానుంది. దీనికి సంబంధించి జిల్లా, మండల స్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

**పెరిగిన డిజిటల్ చెల్లింపులు**

కొవిడ్ తర్వాత మారుమూల పల్లెలకు సైతం యూపీఐ సేవలు విస్తరించాయి. ఇందులో భాగంగానే గ్రామ పంచాయతీలో ప్రజలు సులువుగా నగదు రహిత చెల్లింపులు జరిపేలా యూపీఐ సేవలు తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే దీనిపై కేంద్ర పంచాయతీ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

## కేసీఆర్ అంటే నమ్మకం.. కాంగ్రెస్ అంటే నాటకం: మంత్రి హరీశ్ రావు

ఇబ్రహీంపట్నం: కేసీఆర్ అంటే ఒక నమ్మకం.. కాంగ్రెస్ అంటే నాటకమని మంత్రి హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతులపై పగపబట్టిందని విమర్శించారు. రైతుబంధు ఇవ్వొద్దని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అంటే మాటలు, మూటలు, ముఠాలు దుయ్యబట్టారు. రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో ఏర్పాటుచేసిన ఇబ్రహింపట్నం బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి బూత్‌కమిటీ నాయకుల సమావేశానికి మంత్రి హరీశ్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో గెలువలేని అభ్యర్థులు కూడా నేనే సీఎం అంటున్నారని ఎద్దేవాచేశారు. ఆ పార్టీ నాయకులకు పదవుల మీద యాస తప్ప పనిమీద లేదని విమర్శించారు. చావునోట్లో తలపెట్టి కేసీఆర్ తెలంగాణ సాధించారని మంత్రి చెప్పారు. ఎవరెన్ని గిమ్మిక్కులు చేసినా కేసీఆర్ హ్యాట్రిక్ కొడతారని నమ్మకం వ్యక్తంచేశారు. కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయకుండా కిషన్ రెడ్డి పారిపోయారని గుర్తుచేశారు. ఇలాంటి నాయకులా కేసీఆర్‌కు పోటీ అని విమర్శించారు. కేసీఆర్‌కు పనితనం తప్పా.. పగతనం లేదని స్పష్టం చేశారు. రైతుబంధును సృష్టించిందే సీఎం కేసీఆర్ అని చెప్పారు. రైతుల దగ్గర పన్నులు వసూలు చేసింది కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. రైతుకే పెట్టుబడి ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీ అన్నారు. రైతుబంధు ఇచ్చి వ్యవసాయాన్ని పండుగలా చేశామని తెలిపారు. పంటపెట్టుబడి సాయం కింద రూ.72 వేల కోట్లు ఇచ్చామన్నారు. కర్ణాటకలో రైతులకు 3 గంటలు కూడా కరెంటు రావడం లేదని చెప్పారు. మహిళల కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. అందువల్ల మహిళలంతా ముఖ్యమంత్రి వైపే ఉన్నారని స్పష్టం చేశారు. మిషన్ భగీరథతో ఇంటింటికీ మంచినీళ్లు ఇస్తూ తాగునీటి కష్టాలు తీర్చారన్నారు.



తెలంగాణ ఆచరిస్తది.. దేశం అనుసరిస్తదని మంత్రి అన్నారు. మరోసారి అధికారంలోకి వస్తే రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని, సౌభాగ్యలక్ష్మి పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కోటి కుటుంబాలకు కేసీఆర్ బీమా అందిస్తామన్నారు. కేసీఆర్ బీమాతో రాష్ట్రంలో ప్రతి ఇంటికి ధీమా అన్నారు. తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. తెల్లరేషన్ కార్డుదారులతకూ రూ.5 లక్షల బీమా కల్పిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 40 లక్షల కుటుంబాలకు రైతు బీమా వస్తున్నదని చెప్పారు. పార్టీ బూత్ కమిటీ సభ్యులు క్రియాశీలకంగా పనిచేయాలన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలను గడపగడపకు తీసుకెళ్లాలన్నారు. మంచికంటే చెడుకు వ్యాప్తి ఎక్కువని చెప్పారు. సోషల్ మీడియాలో గ్లోబల్ ప్రచారం జరుగుతున్నదని విమర్శించారు. తప్పుడు ప్రచారాన్ని సోషల్ మీడియాలోనే తిప్పికొట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ పథకాలను కాపీ కొడుతున్నదని విమర్శించారు. వచ్చే ఐదేండ్లలో ఇబ్రహీంపట్నంకు సాగునీళ్లు తెస్తామని హామీ ఇచ్చారు.

## గుజరాత్ నుంచి హైదరాబాద్ తరలిస్తున్న 4.5 కోట్ల విలువైన బంగారం పట్టివేత

సంగారెడ్డి: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు, ఎన్నికల అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. భారీగా నగదు, బంగారం, బంగారు, వెండి నగలు పెద్దమొత్తంలో పట్టుబడుతున్నాయి. శుక్రవారం ఉదయం సంగారెడ్డి జిల్లాలోని ముంబై-హైదరాబాద్ 65వ నంబర్ జాతీయ రహదారిపై చెరాగ్‌పల్లి శివారులో ఏర్పాటుచేసిన మాడ్గి అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఓ కారులో తరలిస్తున్న 7 కిలోల బంగారాన్ని గుర్తించారు. అయితే సరైన పత్రాలు చూపించకపోవడంతో దానిని సీజ్ చేశారు. పట్టుబడ్డ బంగారం విలువ రూ.4 కోట్ల 55 లక్షలు ఉంటుందని చెప్పారు. బంగారాన్ని గుజరాత్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారని చెప్పారు.



# బస్సుపాసులు తగ్గుతున్నాయ్..!



ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వ విధానానికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ) యాజమాన్యం ప్రయాణికుల సౌలభ్యం కోసం రకరకాల బస్సుపాసులను జారీ చేస్తోంది. ఓ వైపు ప్రయాణికుల సంక్షేమం.. మరోవైపు ఆర్టీసీ మనుగడను దృష్టిలో ఉంచుకొని కొత్త పథకాలను ప్రవేశపెడుతోంది. ఇటీవల పల్లెవెలుగు బస్సుల్లో మహిళలు, సీనియర్ సిటిజన్స్ టీ-9 టికెట్‌పై రూ.100 చెల్లించి 60 కిలోమీటర్లు రానుపోను ప్రయాణించే వెసులుబాటు కల్పించింది. బస్సుల్లోనే రాయితీపై ఈ టికెట్లను విక్రయిస్తోంది. ఇప్పటికే విద్యార్థులు, శారీరక దివ్యాంగులు, జర్నలిస్టులు, చట్టసభల సభ్యులతో పాటు వివిధ వర్గాల వారికీ ఉచిత, రాయితీ ప్రయాణ సౌకర్యాలను అమలు చేస్తోంది. ఖమ్మం రీజియన్ పరిధిలో బస్సుపాసులను వినియోగించుకునే విషయంలో ప్రయాణికుల నుంచి మిశ్రమ స్పందన కన్పిస్తోంది.

**కొన్ని వర్గాల ఆసక్తి...**

ఆర్టీసీ విక్రయిస్తున్న బస్సుపాసులను వినియోగించునే విషయంలో కొన్ని వర్గాలవారే ఆసక్తి చూపుతున్నారు. దివ్యాంగులు, విద్యార్థులు, రాయితీ పాసులు తీసుకుంటున్న వారే అత్యధికంగా ఉంటున్నారు. దివ్యాంగుల తర్వాత విద్యార్థి రాయితీ పాసులకు డిమాండ్ ఉండగా.. తర్వాత 18 ఏళ్లలోపు బాలికలు ఉచిత పాసులను ఎక్కువగా వినియోగించుకుంటున్నారు. సాధారణ ప్రయాణికుల్లో సీజనల్ పాస్‌లు తీసుకునే వారి సంఖ్య ఆ తర్వాతి స్థానంలో ఉంది. 2022లో దాదాపు 46,900 మంది వివిధ రకాల పాసులను వినియోగించుకోగా 2023 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 18,136 బస్సుపాసులను మాత్రమే ఆర్టీసీ జారీ చేసింది. ప్రయాణికులు, ప్రజల కోసం ఆర్టీసీ అమలు చేస్తున్న పథకాలపై మరింత అవగాహన కల్పించేందుకు యాజమాన్యం ఇటీవల విలేజ్ బస్ ఆఫీసర్ల వ్యవస్థను ప్రవేశపెట్టింది. వినూత్నమైన మార్కెటింగ్ విధానాన్ని పరిచయం చేస్తూ ప్రజలకు మరింత సేవలందించేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో పథకాల ప్రయోజనం, రాయితీలపై టికెట్ల జారీ అంశాలను క్షేత్రస్థాయిలో విస్తృతపరచాలని యోచిస్తోంది.

ప్రయాణికులు రాయితీ, ఉచిత బస్సుపాసులపై ఆసక్తి చూపుతున్నారు. విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుంది. ఆర్టీసీ సేవలపై రీజియన్ పరిధిలో మంచి స్పందనే కన్పిస్తోంది.

భవాని ప్రసాద్, డిప్యూటీ రీజినల్ మేనేజర్

# అయ్యో రామచంద్రాపురం

చర్ల : చుట్టూ అడవులు.. ఎత్తైన కొండలు.. కమ్మేస్తున్న వాగులతో ఆదివాసీలు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ బతుకీడ్చాల్సిందే. వర్షం వస్తే.. వాగు ఉద్ధృతి పెరిగితే చెట్టు తీగలనే వంతెనగా చేసుకుని బాహ్య ప్రపంచంలోకి అక్కడి యువకులు అడుగుపెడతారు. ఈ గ్రామం ఎక్కడో ఛత్తీస్‌గఢ్‌లో ఉందనుకుంటే పొరపాటే.. భద్రాచలం ఏజెన్సీ చర్ల మండలం కుర్నపల్లి పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం (ఆర్‌సీపురం) దుస్థితి ఇది.

**చెట్టు తీగే వంతెనగా..**

కుర్నపల్లి నుంచి రామచంద్రాపురం మధ్యలోనున్న పగిడి వాగు కొన్నిరోజులుగా ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఏటా మాదిరిగానే రామచంద్రాపురం గొత్తికోయలు ఈసారీ అవస్థలు పడుతున్నారు. నిత్యావసరాలు, అత్యవసర పనుల కోసం వాగు దాటి రావాల్సి ఉంటుంది. వాగు వద్ద ఉన్న చెట్టు తీగనే వంతెనగా చేసుకొని నానాయాతన పడుతూ ఇవతలి ఒడ్డుకు చేరుతున్నారు. ప్రవాహ ఉద్ధృతి కాసింత తగ్గుముఖం పడితే వాగులో నుంచే కుర్నపల్లి వస్తుంటారు.

**పది రోజులుగా జలదిగ్బంధం**

పది రోజులుగా రామచంద్రాపురం జలదిగ్బంధంలో చిక్కుకుంది. అక్కడి ఆదివాసీలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. అత్యవసరమైతే వాగులో అతి కష్టమ్మీద కుర్నపల్లి వైపు వస్తున్నారు. బత్తినపల్లి, పెదమిడిసిలేరు వైపు వాగులూ చుట్టుముట్టడంతో రామచంద్రాపురం ద్వీపంలా మారింది.

**రోగమొస్తే అంతే సంగతులు**



గ్రామంలో 21 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఎవరికి రోగమొచ్చినా వాగులు దాటే పరిస్థితి లేక ప్రాణాల కోసం మంత్రాలనే నమ్ముకొని బతుకంతా దేవుడిపై భారం వేయడం తప్ప మరో గత్యంతరం లేకుండా పోయింది. గర్భిణులు, బాలింతల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. ఈ గ్రామంలో ఎనిమిది నెలల గర్భిణితోపాటు కొందరు బాలింతలూ ఉన్నారు.

ఆడవాళ్లకైతే ఏ బాధొచ్చినా నరకమే.. గర్భిణులకు నొప్పులు వస్తే జెట్టీనే దిక్కు.. వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుంటే దేవుడిపై భారం వేస్తాం. ఇక్కడి ఆదివాసీలు రేషన్ తెచ్చుకోవాలన్నా ప్రతినెలా 12 కిలోమీటర్ల దూరంలోని ఆర్.కొత్తగూడెం వెళ్లాల్సి వస్తుంది. మా కష్టాన్ని ప్రభుత్వం గుర్తించి సమస్య పరిష్కారానికి చిన్నపాటి వంతెన నిర్మించాలి.

వెట్టి వీరమ్మ, జోగమ్మ

ఏళ్ల తరబడి ఇవే బతుకులు మావి. వర్షాకాలంలో మూడు నెలలపాటు ఏదైనా రోగం వస్తే ప్రాణాలు పోవడమే కానీ మరో గత్యంతరం లేదు.మూసిక ఇంగయ్య, గ్రామ పటేలు

# అంగన్‌వాడీల్లో నిండుకున్న కందిపప్పు!

అశ్వారావుపేట : భద్రాద్రి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో రెండు నెలలుగా పప్పులు ఉడకడంలేదు. కందిపప్పు సరఫరా చేసే గుత్తేదారుకు కాంట్రాక్టు ఖరారు కానందునే రెండు నుంచి మూడు నెలలుగా కేంద్రాలకు కందిపప్పు సరఫరా కానట్లు తెలుస్తోంది. కేంద్రాలకు వచ్చే లబ్ధిదారుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతుంది. మరోవైపు అంగన్‌వాడీ టీచర్లు పప్పులు వచ్చినా పెట్టడంలేదనే అపవాదులు మోయాల్సి వస్తోంది. పేద కుటుంబాల చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యం నెరవేరడంలేదు.

ఈ ఏడాది జనవరి నుంచి కేంద్రాలకు నూనె, పాలు, పప్పులు సక్రమంగా సరఫరా కావడంలేదు. ఒక నెల వస్తే మరో నెల రాని దుస్థితి నెలకొంది. మార్చిలో కందిపప్పు ధరల నిర్ణయంలో గుత్తేదారులు సిండికేటు అయ్యారని అధికారులు రద్దుచేశారు. ఆ తరువాత గుత్తేదారు ఖరారు కాలేదని సమాచారం. అంగన్‌వాడీ కేంద్రాలకు పప్పులు రాకపోతే కనీసం కూరగాయలైనా కొనిపెట్టాలని ఐసీడీఎస్ పీఓలు అంగన్‌వాడీ టీచర్లపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిలో కందిపప్పు కేంద్రాలకు రాలేదు. ఏప్రిల్‌లో సరఫరా చేశారు.



కొన్ని కేంద్రాల్లో మూడు నెలలుగా, కొన్ని కేంద్రాల్లో జూన్ నుంచి కందిపప్పు సరఫరా కాలేదు. మార్కెట్లో కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో వాటిని కొనిపెట్టాలంటే తలకు మించిన భారంగా మారిందని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల క్రితం నిర్ణయించిన ధరలనే అమలు చేస్తుండటంతో గుత్తేదారులు ముందుకు రావడంలేదనే విమర్శలు ఉన్నాయి.

**దస్త్రం పెండింగ్‌లో ఉంది**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు రెండు నెలలకు 25,612 కిలోల కందిపప్పు రావాల్సి ఉంది. ఈ అంశాన్ని అధికారుల దృష్టికి మూడుసార్లు తీసుకెళ్లాను. ఇందుకు సంబంధించిన దస్త్రం అదనపు కలెక్టర్ వద్ద పెండింగ్‌లో ఉంది. కందిపప్పు రాగానే కేంద్రాలకు సరఫరా చేస్తాం.సబిత,డీడబ్ల్యూఓ

# రహదారుల కోత.. ఎన్నాళ్లీ వెత

భూపాలపల్లి : గత నెలలో కురిసిన కుండపోత వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లోని ప్రధాన రోడ్లతో పాటు గ్రామీణ ప్రాంత రహదారులు అధ్వానంగా మారాయి. అడుగడుగునా మోకాలు లోతు గుంతలతో ద్విచక్రవాహనదారులు అవస్థలు పడుతున్నారు. తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.గత నెలలో కురిసిన కుండపోత వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లోని ప్రధాన రోడ్లతో పాటు గ్రామీణ ప్రాంత రహదారులు అధ్వానంగా మారాయి. అడుగడుగునా మోకాలు లోతు గుంతలతో ద్విచక్రవాహనదారులు అవస్థలు పడుతున్నారు. తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. భూపాలపల్లి మండలంలోని ఆజంనగర్ వరకు 23 కి.మీ వరకున్న రోడ్డు అధిక వర్షాల కారణంగా రాంపూర్ నుంచి నాగారం మీదుగా ఆజంనగర్ వరకు అనేక ప్రాంతాల్లో గుంతలు పడటంతో చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారిపై నుంచి భూపాలపల్లి మండలంతో పాటు మహాముత్తారం మండలంలోని సుమారు పది అటవీ గ్రామాలకు పైగా ప్రయాణికులు వెళ్తుంటారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు కొనసాగుతాయి.కాశీంపల్లి గ్రామ శివారు నుంచి గొర్లవీడు వరకు రోడ్డు పలు ప్రాంతాల్లో గుంతలు పడటంతో వాహనాల రాకపోకలకు



తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. నాచారం వరకు రోడ్డు కూడా అధిక వర్షాలతో పలు ప్రాంతాల్లో కోతకు గురైంది. ఈ రోడ్డు మార్గం నుంచి నాచారం, తాడ్వాయి, మల్లయ్యపల్లి గ్రామాల నుంచి కాశీంపల్లి మీదుగా భూపాలపల్లికి చేరుకుంటారు. రహదారి మరమ్మతు పనులు చేపట్టాలని పలు అటవీ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ గ్రామ శివారు నుంచి ఆముదాలపల్లి గ్రామానికి చెందిన రోడ్డు గుంతల మయంగా మారింది. కమలాపూర్ గ్రామ సమీపంలోని సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంతంలో మట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. చిన్నపాటి వర్షం పడినా గుంతల నిండా నీరు నిలిచి ద్విచక్రవాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారి మధ్యలోని లోలెవల్ కల్వర్టు పైపులు ధ్వంసం కావడంతో వాహనదారులకు గండంగా మారింది.

భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు నుంచి మల్హార్ మండలం అనుసాన్‌పల్లి గ్రామ శివారు నుంచి జంగేడు గ్రామం మీదుగా భూపాలపల్లికి చేరుకుంటారు. గత నెలలో కురిసిన వర్షాల కారణంగా అనుసాన్‌పల్లి గ్రామ సమీపంలోని వడ్లోనివాగు ప్రాంతంలో వరద తాకిడికి తారు రోడ్డు కోతకు గురికావడంతో వాహనాల రాకపోకలు కొద్ది రోజులుగా నిలిచిపోయాయి. ధ్వంసమైన రోడ్డు విషయమై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కనీసం మరమ్మతు చేపట్టకపోవడంతో అనుసాన్‌పల్లి గ్రామ సర్పంచి జగన్ సొంతగా ట్రాక్టర్‌తో మొరం పోయించడంతో తాత్కాలికంగా రాకపోకలు కొనసాగుతున్నాయి.రేగొండ మండలంలో భారీ వర్షాలతో కోతకు గురైన రావులపల్లి, పాండవుల గుట్ట రహదారులు మరమ్మతుకు నోచుకోవడం లేదు. గత నెలలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు తిర్మలగిరి శివారు రావులపల్లి నుంచి నారాయణపురం గ్రామాల మధ్య వంతెన రెండు వైపులా వరద తీవ్రతకు రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. పాండవుల గుట్టకు వెళ్లే బీటీ రోడ్డు కల్వర్టు వద్ద పెద్ద బుంగ పడింది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..


– తిరుపతి, పీఆర్ ఏఈ, భూపాలపల్లిమండలంలోని పలు గ్రామాల్లోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గ త రోడ్లు గత నెలలో కురిసిన అధిక వర్షాలతో దెబ్బతిన్నాయి. మరమ్మతు పనుల కోసం నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదల కాగానే పనులు ప్రారంభిస్తాం.

# మంచంపట్టిన పల్లెలు

తిర్యాణి : జిల్లాలో జ్వరాలు ప్రబలుతున్నాయి. డయేరియా, టైఫాయిడ్, మలేరియా, డెంగీ తదితర వాటితో పాటు సాధారణ, వైరల్ జ్వరాలతో చాలామంది ప్రజలు విలవిల్లాడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. కొంతమందిలో తెల్లరక్త కణాలు తగ్గుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. మరో వైపు జిల్లాలో రెండో ఏఎన్ఎంల నిరవధిక సమ్మెతో గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణపై ప్రభావం పడుతోంది.చాలా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ గాడి తప్పింది. మురుగు కాలువల్లో పూడిక నిండి దోమలు బెడదతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. చాలా గ్రామాల్లో ఇంటికి ఒకరిద్దరు జ్వరాలతో బాధపడుతున్నారు. కొన్ని గ్రామీణ ప్రాంత ఆరోగ్య కేంద్రాల్లో రోజుకు 20- 30 మంది వచ్చే ఓపీ(అవుట్ పేషంట్) 70–100 వరకు పెరిగింది. దీంతో ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏజెన్సీ పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. జ్వర పీడితులను గుర్తించి రక్తపూతలు సేకరిస్తున్నారు. 783 గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి 23,649 మందిని పరీక్షించగా.. 2591 మందికి జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వారిలో 13 మలేరియా, 11 టైఫాయిడ్, మిగతావి సాధారణ జ్వరాలుగా గుర్తించి వైద్య సేవలందించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సుమారు వందకు పైగా రెండో ఏఎన్ఎంలు వారం రోజులుగా నిరవధిక సమ్మెకు దిగడంతో గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇది వరకు రోజుకు 30–35 శిబిరాలు నిర్వహించేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 15–20కి పడిపోయింది.

ఇంటికి ఒకరిద్దరు బాధితులు..కొన్ని గ్రామాల్లో జ్వర బాధితులు వారం పదిరోజులుగా మంచానికే పరిమితమై తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళుతున్నా.. అక్కడ అంతంత మాత్రమే పరీక్షిస్తున్నారని.. రోజుల తరబడి జ్వరం తగ్గకపోవడంతో మళ్లీ ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుందని వాపోతున్నారు. తిర్యాణి మండలంలో చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అక్కడి పీహెచ్‌సీకి ఇది వరకు రోజుకు 20–25 వరకు వచ్చే ఓపీ.. వారం రోజులుగా 70–100కి పెరిగింది. చుట్టుపక్కల గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని కోమటివాడలో సుమారు 20 కుటుంబాల్లో ఇంటికి ఒకరిద్దరు జ్వరాలతో మంచానికి పరిమితమయ్యారు.

# కోతలకు సన్నద్ధం.. కొనుగోలుకు సమాయత్తం



వరంగల్ : జిల్లాలో వానాకాలం సీజన్ వరి కోతలు మొదలయ్యాయి. వ్యవసాయ మార్కెట్‌లకు రైతులు ధాన్యం తీసుకొస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయడం కోసం జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు చేపట్టింది. వచ్చే నెల నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఏర్పాట్లపై జిల్లా పాలనాధికారి ప్రావీణ్య సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించి తగిన సూచనలు చేశారు.

3,23,808 మెట్రిక్ టన్నుల దిగుబడి..

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 1,34,920 ఎకరాల్లో రైతులు వరి సాగుచేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. సుమారు 3,23,808 మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని అంచనా వేశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా గతేడాది ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే.. ఈ ఏడాది 3,913 ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం తగ్గింది. వచ్చే దిగుబడిలో స్థానిక వినియోగం కోసం 48,571 మెట్రిక్ టన్నులు, విత్తన వినియోగానికి 3,238 మెట్రిక్ టన్నులు పోతుందని, మార్కెట్‌కు వచ్చిన ధాన్యంలో మిల్లర్లు 71,999 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. మిగిలిన 2 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ సిద్ధం అవుతోంది.

199 కేంద్రాలు..

జిల్లాలో ఈసారి 199 కొనుగోలు కేంద్రాల ద్వారా 2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. నవంబరులో 88,399 మెట్రిక్ టన్నులు, డిసెంబరులో 90,267, జనవరిలో 21,334 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో 53, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 123 కేంద్రాలు, జీసీసీ తరఫున ఒకటి, ఇతర ప్రాంతాల్లో 22 కేంద్రాల ద్వారా కొనుగోలు చేయనున్నారు.

మద్దతు ధర..: నాణ్యత ప్రమాణాల ప్రకారం ధాన్యంలో తేమశాతం 17లోపు ఉంటే గ్రేడ్ ఏ రకానికి క్వింటా రూ.2,060, సాధారణ రకానికి క్వింటా రూ.2,040 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించింది.

వీటిపై దృష్టిసారించాలి.. కొనుగోలు కేంద్రాల్లో తరచూ లారీలు ఆలస్యం కావడంతో ధాన్యం మిల్లులకు తరలించడానికి ఇబ్బందులు ఎదురవుతుంటాయి. తగినన్ని వాహనాలను సమకూర్చుకోవాలి.

జిల్లా వ్యాప్తంగా సుమారు 200 వరకు లారీల అవసరం ఉంటుంది. కొనుగోలు కేంద్రాల్లో హమాలీ ఛార్జీలను భిన్నంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. హమాలీ ఛార్జీల విషయంలో అధికారులు దృష్టిసారించాల్సిన అవసరముంది.

కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట దోపిడీని అరికట్టాలి.

కొనుగోలు తర్వాత రైతుల ఖాతాలో ధాన్యం డబ్బుల జమ జాప్యాన్ని నివారించాలి.

ప్రతిసారి గన్నీ సంచుల సమస్య ఎదురవుతోంది. ఎక్కువగా చిరిగిన, రంధ్రాలు పడిన సంచులు ఇస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు. హమాలి, దడవాయి, కూలీ ఛార్జీల కింద క్వింటాలుకు రూ.22 రైతులు భరిస్తున్నారు. దీన్ని ప్రభుత్వమే చెల్లించాలి.

తరుగు పేరుతో దోపిడి..:

–వరికెల సాంబశివరావు, రైతు, నర్సంపేట

కొనుగోలు కేంద్రాల్లో తాలు, మట్టి పేరుతో బస్తాకు రెండు కిలోలు అదనంగా తూకం వేస్తున్నారు. తీరా మిల్లులకు పంపించాక ధాన్యం బాగ లేదని, తేమగా ఉంది మిల్లర్లు బస్తాకు 3–5 కిలోల వరకు కోత పెట్టి కాంటా వేసుకుంటున్నారు. అదేంటంటే తీసుకొనేది లేదని, ఎక్కడైనా అమ్ముకోండని చెబుతున్నారు. మార్కెట్ యార్డులో ఏ గ్రామం రైతు సరకు తెచ్చినా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

నవంబరు రెండోవారం నుంచి కొనుగోళ్లు..

– సంధ్యారాణి, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు వచ్చేనెల రెండో వారం నుంచి ప్రారంభించనున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఇప్పటికే కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించే దిశగా దృష్టిసారించాం. ఎన్నికల నేపథ్యంలో ప్రవర్తన నియమావళి మేరకు నిబంధనలు పాటిస్తాం. కొత్త టెండర్లు పిలవకుండా.. పాత వారికే ధాన్యం రవాణా ఇస్తాం.

# నిత్యాన్నదానానికి మోక్షమెప్పుడో!

వరంగల్ : పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి ఆలయం రాష్ట్రంలోని ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటి. ఏటా ఫిబ్రవరి లేదా మార్చి మాసంలో ఇక్కడ మహాశివరాత్రికి స్వామివారి బ్రహ్మోత్సవాలు, మహాజాతరను వైభవంగా నిర్వహిస్తారు. ఉమ్మడి వరంగల్, నల్గొండ, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. అంతటి ప్రాధాన్యం ఉన్న ఈ ఆలయంలో శాశ్వత నిత్య అన్నదాన సత్రం ఏళ్లుగా అమలుకు నోచుకోవడం లేదు. ఏటా దాతలు ఆర్థిక సాయం చేస్తున్నా ఇప్పటికి భవన సముదాయ నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. దీంతో భక్తులకు నిత్యం తిప్పలు తప్పడం లేదు.

ఆదాయం ఉన్నా.. నిర్మాణం పూర్తి కాదు

సోమేశ్వరాలయానికి ఏటా సుమారు రూ.1.20 కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఏటా ఐదు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల సమయంలో లక్ష మంది భక్తులొస్తారు. నిత్యాన్నదానం పేరిట దేవస్థానం 2013 నుంచి విరాళాలు సేకరిస్తోంది. ఇప్పటి వరకు భక్తులు సుమారు రూ.30 లక్షల వరకు అందించారు. ఆలయం తరపున బ్యాంకులో కొంత నిధులు జమ చేస్తున్నారు. అవి కూడా రూ.లక్షల్లోనే ఉన్నాయని తెలుస్తోంది. ఇక నిత్య అన్నదానం కోసం నిర్మిస్తున్నా భవన సముదాయం ఐదేళ్లుగా అసంపూర్తిగానే ఉంది. 2017లో అప్పటి ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్ రూ.10 లక్షల నిధులు కేటాయించారు. మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణి కూడా రూ.5 లక్షలు నిర్మాణానికి అందించారు. ఈ నిధులు సరిపోక దాతల నుంచి విరాళాలు సేకరించి నిర్మాణానికి వెచ్చించారు. అయినా ఇప్పటికి భవన నిర్మాణం పూర్తి కాలేదు.

గత ఈవోలను అడిగి తెలుసుకుంటా

– లక్ష్మీప్రసన్న, ఈవో సోమేశ్వరాలయం

శాశ్వత నిత్యాన్నదానం కోసం నిర్మిస్తున్నా భవన సముదాయం ఇంకా అసంపూర్తిగానే ఉంది. పూర్తయితేనే నిర్వహణ సిబ్బంది, అమలు సాధ్యా అసాధ్యాలపై నిర్ణయాలు తీసుకుంటాం. ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తా. అలాగే ముందస్తుగా సిబ్బందిని నియమించుకోవాల్సి ఉంటుంది. చాలా పనులుంటాయి. ప్రతి సోమవారం భక్తులు ఆలయానికి ఎక్కువగా వస్తుంటారు. పాత ఈవోలను అడిగి మరింత సమాచారం తెలుసుకుంటా.

ఎవరికీ పట్టింపు లేదుశాశ్వత నిత్య అన్నదాన కార్యక్రమం అమలు చేయడానికి దేవస్థానం ఏమాత్రం ముందస్తు అడుగులు వేయడం లేదని భక్తులు, స్థానికులు గుసగుసలాడుతున్నారు. నిధులున్నా అసంపూర్తి భవన నిర్మాణానికి అధికారులు, తాత్కాలిక పాలక మండలి సభ్యులు పట్టింపు లేనట్లుగానే వ్యవహరిస్తున్నారు. అమలు నిర్వహణ సిబ్బందిని ముందస్తుగా నియమించుకోవడం లేదు. ఇవి కూడా నిత్య అన్నదానం ప్రారంభానికి అడ్డంకులుగా మారాయని చెప్పవచ్చు. అసంపూర్తి భవన నిర్మాణంపై దేవాదాయ, ఇతర శాఖ అధికారులను వివరణ కోరగా నిధులు ఉన్న మేర పనులు చేయించామన్నారు. అనంతరం ప్రైవేటు వ్యక్తులు కట్టిస్తున్నారని, తమకు ఎలాంటి సంబంధం లేదని వారు సమాధానం చెబుతున్నారు.

# 'యూడైస్'లో నమోదైతేనే పరీక్షలకు..!

భూపాలపల్లి: బోగస్ విద్యార్థుల ఏరివేతకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య నిగ్గు తేల్చేందుకు అధికారులు దృష్టి సారించారు. విద్యార్థుల హాజరు పట్టికకు, ఏకీకృత జిల్లా పాఠశాల విద్యా సమాచారం(యూడైస్) మధ్య తేడా లేకుండా సరిచేసేందుకు తాజాగా పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన ఇటీవల సంబంధిత జిల్లాల విద్యాశాఖ కార్యాలయాలకు ఉత్తర్వులు జారీ చేశారు. పదో తరగతి పరీక్షలకు హాజరు కాబోయే విద్యార్థుల వివరాలు యూడైస్‌లో తప్పనిసరిగా నమోదై ఉండాలనేది ఈ ఉత్తర్వుల సారాంశం. ఇందులో నమోదైన పదో తరగతి విద్యార్థులు మాత్రమే 2023–24 విద్యా సంవత్సర పరీక్ష ఫీజు చెల్లించేందుకు అర్హులుగా ప్రకటించింది. ఈ నెల 28 లోగా ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులందర్నీ విధిగా యూడైస్ ప్లస్‌లో నమోదు చేయాలని ఆదేశించింది. అనుమతి లేని పాఠశాలల నుంచి కూడా కొందరు ప్రైవేటు పాఠశాలల నిర్వహకులు విద్యార్థుల ప్రవేశాలు తీసుకొని అనధికారికంగా పదో తరగతులను నడిపిస్తున్నారు. ఆఖరు సమయంలో తమ విద్యార్థులకు మరో పాఠశాల నుంచి పరీక్ష ఫీజు చెల్లించే వారు. అక్కడి నుంచే నామినల్ రోల్స్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగానికి అందించే వారు. ఈ తతంగానికి అడ్డుకట్ట వేసేందుకే. ఈసారి విద్యార్థులను యూడైస్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించింది. ఈ నెలాఖరులోగా ఆన్‌లైన్‌లో నమోదైన వారే పరీక్ష ఫీజు చెల్లించేందుకు అర్హులుగా ప్రకటించింది. దీంతో అనుమతి పొందని ప్రైవేటు పాఠశాలల అటకట్టించడంతో పాటు విద్యార్థుల లెక్కను పక్కాగా తేల్చేందుకు రంగం సిద్ధం చేసింది.

ఫీజులు చెల్లించినప్పుడే..విద్యాశాఖ ఉత్తర్వులతో.. జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలతోపాటు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కొందరు హైరానా పడుతున్నారు. అనధికారికంగా పదో తరగతి ప్రవేశాలు పొందిన ప్రైవేటు వారు వెంటనే విద్యార్థులను మరో పాఠశాలలో నమోదు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే ముఖ గుర్తింపు విధానం ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్(ఎఫ్ఆర్ఎస్)లో విద్యార్థులు హాజరు నమోదు ప్రారంభమవడంతో రిజిస్టర్‌లో పేరుండి దీర్ఘకాలికంగా పాఠశాలలకు రాని విద్యార్థుల పేర్లను తొలగించి, ఆన్‌లైన్ డ్రాప్ బాక్స్‌లో వేసేందుకు యోచిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పడిపోకుండా ఉండేందుకు తొమ్మిదో తరగతి నుంచి ఇప్పటి వరకు హాజరుకాని వారు కూడా రిజిస్టర్‌తో పాటు యూడైస్‌లో నమోదై ఉన్నారు. విద్యార్థుల సంఖ్యతో ఉపాధ్యాయుల పోస్టుల సంఖ్య ముడిపడి ఉండటంతో కొందరు ఈ విధానాన్ని కొనసాగిస్తున్నారు. పది పరీక్ష ఫీజు చెల్లించే సమయంలో వీరి పేర్లను తొలగించి ఆన్‌లైన్ డ్రాప్ బాక్స్‌లో వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ ఏడాది జిల్లాలో పదో తరగతి పరీక్షలకు ఎంతమంది హాజరు కానున్నారో ఫీజులు చెల్లించినప్పుడే లెక్క తేలుతుందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

నమోదు ఎలా చేయాలంటే..విద్యార్థి వ్యక్తిగత పూర్తి వివరాలను యూడైస్ ప్లస్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అడ్మిషన్ రిజిస్టర్ ప్రకారం.. విద్యార్థి పేరు. పుట్టిన తేదీ, తరగతి, తల్లి తండ్రుల పేర్లు, ఆధార్ సంఖ్య, చిరునామా, చరవాణి సంఖ్య, ఆర్థిక స్థితి, కులం, ప్రస్తుత పాఠశాల, గతంలో చదివిన పాఠశాల తదితర సమచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదైన ఈ వివరాలనే నామినల్ రోల్‌లో తీసుకుంటారు. గడువులోగా నమోదు చేయాలిపదో తరగతి విద్యార్థులందరినీ విధిగా యూడైస్‌లో నమోదు చేయించాలని అత్యవసర సమాచారంగా చేరవేశాం.

# ఆశపెడతారు.. అందినకాడికి దోచేస్తారు

ఖమ్మం : పెట్టుబడి పెడితే లాభం వస్తుందని ఎస్ఎంఎస్ పంపగా బూర్గంపాడు మండలానికి చెందిన ఓ వ్యక్తి నమ్మారు. తన ఖాతా నుంచి రూ.10వేలు, రూ.20వేలు ఇలా విడతల వారీగా రూ.3.50 లక్షలు పంపించారు. తర్వాత సమాచారం రాకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు.ఖమ్మం నగరానికి చెందిన ఒక మహిళ చరవాణికి ఎస్ఎంఎస్ వచ్చింది. వివరాలు నమోదు చేస్తే లాటరీ ద్వారా అత్యధిక నగదు బహుమతి పొందవచ్చునని నమ్మించారు. సదరు మహిళ లింక్‌పై క్లిక్ చేసి వ్యక్తిగత వివరాలు పొందుపరిచాక తొలుత రూ.10వేలను ఫలానా ఖాతాలో జమచేయాలని మరో ఎస్ఎంఎస్ వచ్చింది. నమ్మి రూ.10వేలు జమచేస్తే అవతలి వ్యక్తి నుంచి స్పందన లేదు.రోజురోజుకూ సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఏమరుపాటుగా ఉంటే బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. పేద, ధనిక తేడా లేకుండా జనాలను ఉచ్చులో బిగించి ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ప్రచారం చేస్తున్నా సైబర్ నేరగాళ్లు కొత్తతరహా



మోసాలకు తెరలేపుతున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో నెలకు సగటున 30 కేసులు నమోదవుతుండటం కలవరపరుస్తోంది.

అప్రమత్తతతో ఆట కట్టు

స్మార్ట్‌ఫోన్ వినియోగదారులను లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు చెలరేగుతున్నారు. కాస్త అప్రమత్తంగా ఉంటే మోసగాళ్ల ఆట కట్టించవచ్చునంటున్నారు పోలీసులు. సైబర్ క్రైం జరిగిందని తెలిసిన వెంటనే 1930 నంబరుకు ఫోన్‌చేస్తే ఏ బ్యాంకు ఖాతాలో డబ్బులు జమైతే ఆ ఖాతాను పోలీసులు నిలుపుదల చేస్తారు. బ్యాంకు ఖాతా వివరాలతో నేరస్థుణ్ని పట్టుకోవడానికి అవకాశం ఉంటుంది. 1930 నంబరుకు డయల్ చేయడంతో పాటు సమీప ఠాణాలో ఫిర్యాదు పత్రం అందించాలి.

ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ ద్వారా..

సైబర్ క్రైం జరిగిన వెంటనే ఎన్‌సీఆర్‌పీ (నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్)లో వివరాలు నమోదు చేయాలి. అంతకుముందు ఈ పోర్టల్‌లో ఫోన్ నంబర్ సహాయంతో లాగిన్ కావాలి. ఐడీ నమోదవుతుంది. తర్వాత ఎప్పుడైనా, ఎక్కడైనా పోర్టల్‌లోనే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. సైబర్ క్రైం జరిగిన ప్రదేశం, సమీపంలోని పోలీస్‌స్టేషన్ వివరాలను పొందుపరచగానే సంబంధిత పోలీసులు తక్షణం స్పందిస్తారు. అంతేకాకుండా ఆడపిల్లలు, మహిళలు లైంగిక వేధింపులకు గురైనా ఈ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.ప్రజల నుంచి సైబర్ క్రైం కేసు వివరాలు అందగానే చర్యలు తీసుకుంటున్నాం. జనం అప్రమత్తంగా ఉంటే చాలావరకు మోసాలను నివారించవచ్చు. ముఖ్యంగా ఫోన్‌కు వచ్చే లింకులను ఓపెన్ చేయటం, బ్యాంకు కస్టమర్ కేర్ నుంచి అని చెప్పి మాట్లాడే వారికి ఖాతా వివరాలు ఇవ్వటం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయటం, ఓటీపీలు ఇతరులకు చెప్పడం వల్ల మోసపోయే ఆస్కారముంది. శ్రావణ్, ఐటీ కోర్ ఎస్సై, కొత్తగూడెం

# ప్రగతి.. ప్రతిపాదనలకే పరిమితం

గోదావరిఖని : దళిత వాడలు, గిరిజన తండాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చేపట్టిన సర్వే కాగితాలకే పరిమితమైంది. ప్రభుత్వ ఆదేశాలతో ఆగమేఘాలపై క్షేత్ర స్థాయికి వెళ్లిన అధికారులు ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై దృష్టి సారించారు. సిమెంటు రహదారులు, మురుగు కాలువలు, విద్యుత్తు స్తంభాలు, తాగునీటి సరఫరా తదితర సమస్యలను గుర్తించారు.

అవసరమైన నిధుల మంజూరుకు ప్రతిపాదించి రెండేళ్లు దాటినా పైసా నిధులు కేటాయించలేదు. దీంతో కాలనీల్లో కష్టాలు తీరతాయని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. మరోవైపు వర్షాకాలంలో బురదమయంగా మారిన రహదారులపై నరకయాతన తప్పడం లేదు. మురుగు కాలువ వ్యవస్థ లేక దుర్గంధంతో జీవనం సాగించాల్సి వస్తోంది. జిల్లాలోని 452 దళిత, 28 గిరిజన తండాలు కలిపి మొత్తం 480 ఆవాసాల్లో రూ.128.88 కోట్లకు సంబంధించి ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి.

ప్రాధాన్య క్రమంలో నమోదు

జిల్లాలో 266 పంచాయతీల్లో సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా ఎస్సీ సామాజిక వర్గ జనాభా 1,54,855. ఇందులో 77,311 మంది పురుషులు, 77,544 మంది మహిళలున్నారు. ఎస్టీల జనాభా 14,945 కాగా 7,520 మంది పురుషులు, 7,425 మంది మహిళలున్నారు. పంచాయతీ సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో సమస్యలపై ఆరా తీశారు. ఎక్కడెక్కడ ఎలాంటి వసతులు అవసరమనే విషయమై ప్రజల అభిప్రాయాలు తీసుకున్నారు. సిమెటు రహదారులు, మురుగు కాలువలు, వీధి దీపాలు, ప్రమాదకర విద్యుత్తు వ్యవస్థ, తాగునీటి పైపులైన్ల నిర్మాణం, లీకేజీల వంటి వాటిపై ప్రాధాన్య క్రమంలో నమోదు చేసుకున్నారు.

రహదారులు.. విద్యుత్తు సరఫరా

దళిత, గిరిజన ఆవాసాల్లో ప్రధానంగా సిమెంటు రహదారులకు సంబంధించి 2301 పనులకు రూ.50.11 కోట్ల నిధులతో ప్రతిపాదించారు. 787 కొత్త నల్లా కనెక్షన్లు, 243 లీకేజీ నల్లాలున్నట్లు గుర్తించారు. జిల్లావ్యాప్తంగా 1,26,098 మీటర్ల మేర ఎల్‌టీ లైన్, 442 మధ్యస్థ స్తంభాల బిగింపు, 58 ఒరిగిన, 168 విరిగిన స్తంభాలు, 11 కేవీ 188, ఎల్‌టీ(ఇళ్లలోకి వచ్చే విద్యుత్తు తీగలు) లైన్ల తొలగింపు కోసం నివేదించారు. 57 చోట్ల డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల(డీటీఆర్) సామర్థ్యం పెంపు, 68 డీటీఆర్‌లు అదనంగా అవసరమవుతుందని నిర్ధారించారు.

సమస్యలతో సహవాసంమౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల కోసం అధికారులు పంపిన ప్రతిపాదనలు అటకెక్కాయి. రాష్ట్రంలో హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో ఆ నియోజకవర్గంలో తప్ప మిగిలిన ప్రాంతాల్లో ఇప్పటికీ పైసా నిధులు మంజూరు చేయలేదు. ప్రతి సంవత్సరం వానాకాలంలో గుంతలు, బురదమయవుతున్న రహదారులతో ప్రజలకు నరకయాతన తప్పడం లేదు. మురుగు కాలువ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో దుర్గంధం వెదజల్లి వ్యాధులు ప్రబలుతున్నాయి. అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలకు నిధులు మంజూరు కాలేదని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తే పనులు చేస్తామని పేర్కొంటున్నారు.

# ఎన్నికల ప్రక్రియకు వెన్నెముక

కొత్తగూడెం : ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ అత్యంత కీలకాంశం. ఓటుహక్కుతో ప్రజలు తమకు నచ్చిన ప్రజాప్రతినిధిని ఎన్నుకునే ప్రక్రియ ఇది. ఈ క్రమంలో వజ్రాయుధంగా భావించే ఓటుహక్కు వినియోగం వెనక ఎంతో కసరత్తు, వేల మంది అధికార యంత్రాంగం శ్రమ ఉంటుంది.

ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ అత్యంత కీలకాంశం. ఓటుహక్కుతో ప్రజలు తమకు నచ్చిన ప్రజాప్రతినిధిని ఎన్నుకునే ప్రక్రియ ఇది. ఈ క్రమంలో వజ్రాయుధంగా భావించే ఓటుహక్కు వినియోగం వెనక ఎంతో కసరత్తు, వేల మంది అధికార యంత్రాంగం శ్రమ ఉంటుంది. జిల్లా ఎన్నికలాధికారి మొదలుకుని గ్రామస్థాయిలో బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ) వరకు సమన్వయంతో విధులు నిర్వర్తిస్తేనే ఎన్నికలు సజావుగా జరుగుతాయి. ఎక్కడైనా సమన్వయం లోపిస్తే ఎన్నికలకు ఆటంకాలు ఎదురవుతాయి. అభ్యర్థులు నామినేషన్ పత్రాల దాఖలు ఎన్నికల నియమావళి అమలు, పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి వరకు ఆయా అధికారులు బాధ్యతగా పనిచేయాల్సి ఉంటుంది. తాజా ఎన్నికల నేపథ్యంలో ఉభయ జిల్లాల్లో అధికారులు వారికి అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించే పనిలో పడ్డారు.

ఉమ్మడి జిల్లాలో ఎన్నికల అధికారుల వివరాలు

ఖమ్మం జిల్లా భద్రాద్రి కొత్తగూడెం పోలింగ్ కేంద్రాలు



కలెక్టరు జిల్లా ఎన్నికల అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. మిగతా ఎన్నికల నిర్వహణాధికారులను సమన్వయపరుస్తారు. అందరికీ విధులు కేటాయిస్తారు. నిరంతర సమీక్షలు జరుపుతారు. అన్ని స్థాయిల్లో అధికారులకు దిశానిర్దేశం చేస్తారు. కలెక్టరేట్‌లో కావాల్సిన శిక్షణలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తారు. ఓటరు జాబితా రూపకల్పన మొదలుకుని ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు పూర్తి బాధ్యత వీరిదే.

జిల్లా ఎన్నికల అధికారి

వీరు నియోజకవర్గ బాధ్యులు. శాసనసభ, పార్లమెంటు ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతీ నియోజకవర్గానికి ఒక ఆర్వోను కేంద్ర ఎన్నికల సంఘం నియమిస్తుంది. తమ పరిధిలో ఎన్నికల అంశాలను వీరు పర్యవేక్షిస్తారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, తిరస్కరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, పోలింగ్ కేంద్రాల సిబ్బంది నియామకం, శిక్షణ, ఈవీఎంల ర్యాండమైజేషన్, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి, వసతుల కల్పన వీరు చూస్తారు.

రిటర్నింగ్ అధికారి (ఆర్వో)

ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగడంలో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకం. ముఖ్యంగా పోలింగ్ బూత్‌ల పర్యవేక్షణ బాధ్యత చూస్తారు. ఒక్కొక్కరి పరిధిలో 6 నుంచి 9 వరకు కేంద్రాలుంటాయి. ఆయాచోట్ల ర్యాంపుల ఏర్పాటు, తాగునీటి వసతి, ఫర్నిచర్, విద్యుత్తు, లైట్లు, ఫ్యాన్ల ఏర్పాటు సహా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూస్తారు. తమ పరిధిలో ఏం జరిగినా వీరే బాధ్యత వహిస్తారు.

ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. ఆ కేంద్రంలో వీరే సంపూర్ణ బాధ్యత తీసుకుంటారు. ఓటింగ్‌కు అవసరమైన ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, ఇతర సామగ్రి తీసుకొస్తారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించిన అనంతరం ఎన్నికల సామగ్రిని తిరిగి నియోజకవర్గ స్థాయి స్ట్రాంగ్ రూంకు చేర్చుతారు. వీరికి సహాయంగా అదనపు ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. పోలింగ్ కేంద్రాల్లో కార్యకలాపాలన్నీ వీరి పర్యవేక్షణ లోనే జరుగుతాయి. ఎన్నికల సంఘం రూపొందించిన హ్యాండ్‌బుక్ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాల్సి ఉంటుంది. వీరితో పాటు మరో ఇద్దరు పోలింగ్ అధికారులు పనిచేస్తారు. ఓటర్లకు ఇంకు పూయడం, ఈవీఎంలు పనిచేస్తున్నాయో? లేదో చూసుకుంటారు.

ప్రిసైడింగ్ అధికారి

బూత్ లెవల్ అధికారులు అందించిన సమాచారంతో ఓటరు జాబితాను తయారు చేయడం ఓటు నమోదు అధికారుల ప్రధాన విధి. కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలనుకునే వారు, జాబితాలో పేర్లు తప్పుగా ఉన్నవారు ఈ అధికారిని సంప్రదించాలి. తుది ఓటరు జాబితా రూపకల్పనలో ప్రధాన పాత్ర వీరిదే.

ఓటు నమోదు అధికారులు

ఎన్నికల నిర్వహణలో గ్రామస్థాయిలో పనిచేసే వారే బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు). గ్రామంలో 18 ఏళ్లు నిండిన యువత ఓటు నమోదు చేసుకునేలా చూస్తారు. కావాల్సిన దరఖాస్తులు అందుబాటులో ఉంచుతారు. పూర్తిచేసిన వాటిని స్వీకరిస్తారు. తుది జాబితా ప్రదర్శన, పోలింగ్ కేంద్రాల మార్పునకు సంబంధించి పై అధికారులకు సహకరించడం వీరి విధి.

## గెజిట్ జాబితాపై తొలగని ఉత్కంఠ

బోయినపల్లి : అదనపు టీఎంసీ కాలువ నిర్మాణంలో నిర్వాసితులుగా మారుతున్న వారికి పరిహారం అందించేందుకు రూపొందించనున్న ఆర్అండ్ ఆర్ జాబితా గెజిట్‌పై ఉత్కంఠ నెలకొంది. నెల రోజుల క్రితం గ్రామ సభను అధికారులు నిర్వహించారు. అనంతరం కొంత మంది తమ పేర్లు తప్పిపోయాయని దరఖాస్తు చేసుకోగా, మరికొంత మంది అనర్హులకు చోటు కల్పించారని ఫిర్యాదు చేశారు. దీంతో సందిగ్ధత నెలకొంది. కాళేశ్వరం అదనపు టీఎంసీ కాలువ నిర్మాణంలో భాగంగా దేశాయపల్లిలో రైతుల వ్యవసాయ భూములతోపాటు ఇళ్లు ముంపునకు గురవుతున్నాయి. వరద కాలువకు అవతలి వైపు ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ పరిహారం అందించడంలో భాగంగా అధికారులు ఏడాది క్రితం గ్రామంలో (సోషియో ఎకనామిక్ సర్వే) ఇంటింటి సర్వే నిర్వహించారు. నిర్వాసితుల నివాసం, వృత్తి, ఇతర వివరాలు, రేషన్, ఆధార్ కార్డు, ఇతర ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి నమోదు చేసుకున్నారు. ఒక్కో నిర్వాసిత కుటుంబానికి 75 చదరపు గజాల ఇంటి స్థలం, రూ.6.60 లక్షల పరిహారం, ఇంటి నిర్మాణానికి రూ. 1.25 లక్షలు చెల్లిస్తామని ప్రకటించారు. ఆర్అండ్ఆర్ కాలనీ ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఆర్అండ్ఆర్ కాలనీ కోసం భూసేకరణ చేయడానికి వరద కాలువ సమీపంలో 11 ఎకరాలు పీఎన్ (ప్రిలిమినరీ నోటిఫికేషన్) ప్రచురించారు. కాగా ఓటీఎస్ (వన్‌టైం సెటిల్‌మెంట్) పరిహారం కోరితే రూ.12 లక్షలు చెల్లిస్తామన్నారు. కొంత మంది నిర్వాసితులు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద పరిహారం చెల్లించాలని కోరుతుండగా, అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# నేత్ర నిధి ఏదీ?




భూపాలపల్లి : సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు. ప్రతి మనిషికీ మరణం సహజం. మరణించిన వ్యక్తి కళ్లను దానం చేస్తే వారి నయనాలు ప్రపంచాన్ని చూస్తూనే ఉంటాయి. శరీరంతో పాటు కళ్లను మట్టిపాలు చేయకుండా దానం చేస్తే మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపుతాయనేది నిజం. వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో అంధత్వానికి ప్రధానమైన కంటి శుక్లం, వక్రీభవన లోపాలు, కార్నియా దెబ్బతిన్న వారికి శస్త్రచికిత్సలు చేస్తున్నా, నేత్ర నిధి లేక మృతుల కళ్ల సేకరణ అమలు కావడం లేదు. దానం చేసిన వారి కళ్లను హైదరాబాద్‌లోని సరోజినీదేవి నేత్ర వైద్యశాలకు తరలించి అక్కడే కంటి చూపులేని వారికి ఉపయోగిస్తున్నారు. ఇక్కడి నేత్ర నిధి పూర్తిస్థాయిలో పనిచేసినట్లయితే ఉత్తర తెలంగాణ పరిధిలోని అన్ని జిల్లాల్లో అంధులకు ఇక్కడే కంటిచూపు కల్పించే అవకాశం ఉంటుంది. జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా, ప్రాంతీయ నేత్రవైద్యశాల సూపరింటెండెంట్ కన్వీనర్‌గా, డీఎంహెచ్‌వో సభ్యులుగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ పనిచేస్తున్నా.. అంధత్వ నివారణ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో చేపట్టలేకపోతున్నారు. ప్రతి జిల్లాలో కలెక్టర్ ఛైర్మన్‌గా జిల్లా అంధత్వ నివారణ సంస్థ పనిచేస్తున్నా.. నేత్రదానంపై ఎలాంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టడం లేదు. ఈ నెల 25 నుంచి సెప్టెంబరు 8 వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నా... ప్రారంభ కార్యక్రమం బ్యానర్ ఆవిష్కరణతో సరిపెట్టారు. పదిహేను రోజులు ఏ రోజు ఏ కార్యక్రమం చేపడతారన్నది స్పష్టతలేదు. వాస్తవంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఈ పక్షోత్సవాలలో నేత్రదానంపై పాఠశాల, కళాశాలలు, మెప్మా మహిళా సంఘాలు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని ఉద్యోగులు, కార్మికులు, కంప్యూటర్‌పై పనిచేసేవారికి, చదువుకునే పిల్లలకు, వైద్యసిబ్బందికి అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలి. అలాంటివి ఏమీ లేకుండా ఆఖరి రోజు ఒక ర్యాలీతో పక్షోత్సవాలు పూర్తిచేస్తున్నారు. ఇప్పటికైనా ఐబ్యాంకు ఏర్పాటయ్యేలా, ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎవరు చేయవచ్చు..

మరణం తర్వాత 4- 6 గంటల మధ్య కళ్లను దానం చేయాలి. వయసు, లింగభేదం లేకుండా ఎవరైనా దానం చేయొచ్చు. అంటు వ్యాధులు, అధిక రక్తపోటు, ఆస్తమా రోగులు, మధుమేహం, కళ్లద్దాలు వాడేవారు కూడా కళ్లను దానం చేయవచ్చు. ఎయిడ్స్, హెపటైటిస్ బి, సి, రేబీస్ బ్లడ్‌క్యాన్సర్, ధనుర్వాతం, కలరా, మెదడు వాపు వంటి వ్యాధులున్న వారు మాత్రం కళ్లు దానం చేయరాదు.

ఇలా చేయండి..

మరణించిన వారి నేత్రాలు దానం చేయాలనుకుంటే మృతుల కంటి రెప్పలను మూసివేయాలి. నేరుగా మరణించిన వ్యక్తి మీద ఏదైనా పంకా ఉంటే నిలిపివేయాలి. కింద ఒక దిండు ఉంచి మృతుని తలపైకి లేపాలి. సాధ్యమైనంత త్వరగా సమీప నేత్రనిధి కేంద్రానికి సమాచారం ఇవ్వాలి. కళ్ల దానం తర్వాత వైద్యుడి నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. ముచ్చర్ల గ్రామం ఆదర్శం

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం ముచ్చర్ల గ్రామం నేత్ర దాన హామీలివ్వడంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. తెలంగాణ నేత్ర, శరీర, అవయవ దాతల అసోసియేషన్ ద్వారా ఆ ఒక్క గ్రామం నుంచే 60 మందికి పైగా ప్రజలు నేత్రదానం చేయడానికి ముందుకొచ్చి హామీ పత్రాలు ఇచ్చారు. మరణించిన వారు నేత్ర దానాలు చేస్తున్నారని, ఏ రాత్రి ఎవరు మరణించినా నేత్రదానం చేయడానికి ముందుకొస్తున్నారని అసోసియేషన్ బాధ్యులు తెలిపారు.

పిల్లల్లో చైతన్యం

నేత్రదానం చేయడంపై ఇటీవల విద్యార్థుల్లో చైతన్యం వస్తోంది. చాలా మంది స్వచ్ఛందంగా నేత్రదానం చేస్తామని హామీ పత్రాలు అందజేస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు కల్పిస్తున్న అవగాహనతో తమలో చైతన్యం వచ్చిందని విద్యార్థులు చెబుతున్నారు.

ముందుకొస్తున్నారు..చావు బతుకుల్లో ఉన్న తమ కుటుంబ సభ్యుల కళ్లను దానం చేయడానికి చాలా మంది ముందుకొస్తున్నారు. తమ వారు లేకున్నా.. వారి కళ్లు మరొకరి జీవితాలను నడిపించడం ద్వారా ఎక్కడో ఒకచోట తమ వారు బతికే ఉన్నారన్న సంతోషం మిగులుతుందని నేత్రదాన హామీలిస్తున్నారు. అధికారులు సహకరించడం లేదుమల్లారెడ్డి, అధ్యక్షుడు, తెలంగాణ నేత్ర, శరీర, అవయవ దాతల అసోసియేషన్‌నేత్రదానం, నేత్రాల సేకరణపై కార్యక్రమాలు చేపట్టే జిల్లా అంధత్వ నివారణ సంస్థ కన్వీనర్‌గా ఉన్న వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెం డెంటు సహకరించడం లేదు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు చేపట్టాలి. ఇప్పటివరకు ఎలాంటి కార్యక్రమానికి రూపకల్పన చేయలేదు. కనీస సమాచారం అడిగితే ఇవ్వడం లేదు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ తరఫున ఒక వైద్యురాలు, ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా ఉన్నందున తక్షణం స్పందించి కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

# రోగులకు వరం.. డయాలసిస్ కేంద్రం




వేములవాడ : వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రం రోగులకు వరంగా మారింది. డబ్బులు పెట్టి ప్రైవేటు ఆసుపత్రుల్లో సేవలు పొందలేని వారికి ఇది బాగా ఉపయోగపడుతుంది. రక్త శుద్ధితోపాటు మందులు ఉచితంగా అందిస్తుండటంతో పేదలకు ఆర్థికభారం తప్పింది. పైగా సేవలు సమీపంలోనే అందుతుండటంతో రోగులకు ప్రయాస తప్పింది. ప్రభుత్వం దీప్ చంద్ డయాలసిస్ సెంటర్ (డీసీడీసీ)తో చేసుకొన్న ఒప్పందం మేరకు ఈ కేంద్రాన్ని దాదాపు రూ.80 లక్షలతో వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు. ఇటీవల రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఆధునిక వసతులతో ఆసుపత్రిలోని ఓ వార్డులో అయిదు పడకలతో దీనిని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో నెఫ్రాలజీ బృందం వైద్యులతో కోఆర్డినేషన్ చేసుకుంటూ రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం 16 మంది సేవలు పొందుతున్నారు. వేములవాడ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మూత్రపిండాల వ్యాధిగ్రస్తులు ఈ కేంద్రానికి వస్తున్నారు. ఇప్పటి వరకు ఈ ప్రాంతానికి చెందిన వారు సిరిసిల్ల ప్రాంతీయ ఆసుపత్రికి వెళ్లి రక్తం శుద్ధి చేయించుకొని వైద్యం పొందేవారు. ప్రస్తుతం స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలోనే రక్తం శుద్ధి చేయించుకొంటున్నారు. ప్రతి రోగికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం అయిదు పడకలున్నాయి. రెండు షిఫ్టుల్లో సేవలు అందిస్తున్నారు.

పేదలకు ఆర్థిక భరోసా

వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం పేద రోగులకు ఆర్థికంగా భరోసానిస్తోంది. వేములవాడ పరిసర మండలాలకు చెందిన వారు చాలా మంది నిరుపేదలే ఉన్నారు. వైద్య ఖర్చులు ఆర్థిక భారంగా మారాయి. ప్రైవేటు ఆసుపత్రిలో మూత్రపిండాల వ్యాధిగ్రస్తులు ఒకసారి రక్తం శుద్ధి చేసుకుంటే దాదాపు రూ. 3 వేల నుంచి రూ. 4 వేలు ఖర్చు అవుతుంది. రవాణా ఖర్చులు, వైద్య పరికరాలకు కలిపి మరో రూ. 5 వేల వరకు అవుతున్నాయి. ఈ ప్రాంతీయ ఆసుపత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందించడంతో పేదలకు ఆర్థిక భారం తప్పింది. ఆరోగ్యశ్రీ ద్వారా చేరిన రోగులకు అత్యవసర మందులతో పాటు అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తున్నారు. ప్రస్తుతం ఈ డయాలసిస్ కేంద్రంలో ముగ్గురు టెక్నీషియన్లు, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, కంప్యూటర్ ఆపరేటర్, ఒక డయాలసిస్ ఎగ్జిక్యూటివ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్క రోగికి రక్తం శుద్ధి చేయడానికి కనీసం నాలుగు గంటల సమయం పడుతుంది. రోగి పరిస్థితిని బట్టి వారానికి రెండు, మూడు సార్లు చేస్తారు. వయసును బట్టి దాదాపు 10 లీటర్ల నుంచి 14 లీటర్ల వరకు రక్తం శుద్ధి జరుగుతుందని ఈ కేంద్రం సిబ్బంది తెలిపారు.

సేవలు వినియోగించుకోవాలి- అనిల్, డయాలసిస్ కేంద్రం ఇన్‌ఛార్జి, వేములవాడవేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రంలో ఆధునిక సౌకర్యాలతో రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలందించడం జరుగుతుంది. వేములవాడ పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన మూత్రపిండాల వ్యాధిగ్రస్తులు ఈ డయాలసిస్ కేంద్రంలోని సేవలను సద్వినియోగం చేసుకోవాలి. రోగుల సంఖ్య పెరిగితే షిఫ్టులు పెంచి వైద్య సేవలు అందిస్తాం.

# ధాన్యం మిల్లింగ్ కష్టం

సిరిసిల్ల : పండిన ధాన్యాన్ని మరాడించడం కష్టంగా మారింది. నాలుగేళ్లుగా వానాకాలం, యాసంగి పంటల దిగుబడులు క్రమంగా పెరిగాయి. దానికి సరిపడా ఉప్పుడు, ముడి బియ్యం మిల్లులు లేకపోవడంతో జిల్లాలో అధికారులకు, ఇటు మిల్లర్లకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఫలితంగా ఇక్కడ పండిన పంటలో సగానికిపైగా పొరుగు జిల్లాల్లోని మిల్లులకు కేటాయించాల్సి వస్తోంది. మరోవైపు బియ్యాన్ని ఎఫ్‌సీఐకి కేటాయించే క్రమంలోనూ ఇబ్బందులే. జిల్లాలో ఎఫ్‌సీఐ గోదాంలు లేకపోవడమే ఇందుకు కారణం. ముడి బియ్యానికి కరీంనగర్‌కు, ఉప్పుడు బియ్యానికి జగిత్యాల జిల్లాల్లోని గోదాంల్లో 37 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యమిచ్చారు. దీనికితోడు ఎఫ్‌సీఐ నిబంధనలతో నాలుగు నెలలుగా అయిదు వేల మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లులకే పరిమితమయ్యాయి. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే ఇప్పుడు రాబోయే వానాకాలం ధాన్యం నిల్వలపైనా ప్రభావం చూపనుంది.

పొరుగు జిల్లాలకు కేటాయింపులు

జిల్లాలో ముడి, ఉప్పుడు బియ్యం మిల్లులు కలిపి వంద ఉన్నాయి. వీటికి వానాకాలం (2022-23)లో 2,18,420.76 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాలశాఖ కేటాయించింది. దీనిలో సీఎంఆర్ కింద 1,46,713.919 మెట్రిక్ టన్నులు (ఉప్పుడు, ముడి) బియ్యం కలిపి ఎఫ్‌సీఐకి అప్పగించాలి. ఇప్పటి వరకు 44,681.290 మెట్రిక్ టన్నులు ఇచ్చారు. అంటే లక్ష్యంలో 30 శాతం మాత్రమే. ఇక యాసంగి (2022-23)లో 2,18,413.680 మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించారు. ఇందులోనూ 1,46,917.106 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉండగా 32,973 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారు. లక్ష్యంలో ఇది 22 శాతం మాత్రమే. రెండు సీజన్లకు సంబంధించి ధాన్యం నిల్వలు 70-80 శాతం మిల్లుల్లోనే ఉన్నాయి. జిల్లాలో రెండు రకాల మిల్లుల సామర్థ్యం కలిపి మరాడించే సామర్థ్యం 1.6 లక్షల మెట్రిక్ టన్నులు. దీనికి ధాన్యం దిగుబడులు రెండింతలు వస్తుంది. సేకరణలో మూడు లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. ప్రతి సీజన్‌లో కరీంనగర్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాలకు కేటాయిస్తున్నారు.

దృష్టిసారించాలిధాన్యం దిగుబడులకు తగ్గట్టుగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మిల్లుల విస్తరణ జరగాలి. వీటితోపాటే ఎఫ్‌సీఐ నిబంధనల మేరకు గోదాంల నిర్మాణం అవసరం. ఇవి ప్రస్తుతం రైలు మార్గం అందుబాటులోని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. ఆరేళ్ల క్రితం వరకు జిల్లాలో ధాన్యం దిగుబడులు సగటున లక్ష మెట్రిక్ టన్నులు ఉండేది. ఇప్పుడు మూడు లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. సాగు విస్తీర్ణం, ధాన్యం దిగుబడులు వచ్చినంత వేగంగా మిల్లుల ఏర్పాటు కాలేదు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. జిల్లాకు నలువైపులా రైలు మార్గాలు అందుబాటులో ఉన్నాయి. ఇటీవలే జిల్లాకు 40 కిలోమీటర్ల దూరంలోని సిద్దిపేట వరకు రైలు మార్గం అందుబాటులోకి వచ్చింది.

# వాట్సాప్‌లో సస్యరక్షణ సలహాలు

కొత్తగూడెం : ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంటలు చేతికొచ్చే సమయంలో తెగుళ్ల బారిన పడుతున్నాయి. దిగుబడిపై ఇది ప్రభావం చూపుతుందని కర్షకుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కొందరికి సమస్యపై సరైన అవగాహన లేక ఫెర్టిలైజర్ దుకాణదారులు ఇచ్చిన మందులు పిచికారీ చేస్తున్నారు. ఒక్కోసారి అవి సరిగా పనిచేయక వారం, పదిరోజుల వ్యవధిలోనే మళ్లీ పిచికారీ చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో రైతులకు తెగుళ్లు, చీడపీడలపై అవగాహన కల్పించేందుకు కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వినూత్న పంథా అవలంబిస్తున్నారు. ఎవరైనా రైతు తెగుళ్లు, చీడపీడలు సోకిన పైరు చిత్రాన్ని ప్రత్యేక వాట్సాప్ నంబరు 99668 14470 (జిల్లా వ్యవసాయ, వాతావరణ విభాగం)కు పంపితే చాలు.. తక్షణం సాంకేతిక సలహాలు సిఫార్సు చేస్తున్నారు.

36 గ్రూప్‌లతో చేరువ

రైతులకు సలహాలు, సూచనలు చేసేందుకు కేవీకే వారు వ్యవసాయ అధికారులు, ఫర్టిలైజర్ దుకాణాల నిర్వాహకుల సమన్వయంతో ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.వి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో, జిల్లా వ్యవసాయ వాతావరణ విభాగం పర్యవేక్షకుడు ఎం.సుమన్ పర్యవేక్షణలో దీన్ని నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అయిదు వ్యవసాయ డివిజన్లలోని 26 ఫెర్టిలైజర్ దుకాణదారులు, రైతులకు చెందిన మరో 10 గ్రూపులను అనుసంధానం చేశారు. సాగు విధానాలు, వాతావరణ పరిస్థితులు, వివిధ పంటల్లో ఏర్పడే తెగుళ్లు, రైతుల సందేహాలు, శాస్త్రవేత్తల సలహాలను వాటిల్లో పోస్టు చేస్తున్నారు. 'వరి, మిరప, పత్తి, మొక్కజొన్న రైతులు ఎక్కువగా వాట్సాప్ గ్రూప్ సలహాలు స్వీకరిస్తున్నారు. ఇటీవల వంద మందికి పైగా పంట రక్షణకు పరిష్కారాల్ని పొందారు. సరైన సమయంలో, తగిన మందు పిచికారి చేసుకుంటే నష్టాన్ని నివారించుకోవచ్చు. సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని' ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.వి.లక్ష్మీనారాయణమ్మ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు. అధికారులు, వ్యాపారులు, రైతుల అనుసంధానంగా 'కేవీకే' సేవలు

'ఎకరాలో మిరప సాగు చేశా. ఇటీవల పైరుకు పైముడత ఆశించింది. వెంటనే చిత్రాలను వాట్సాప్‌లో పంపించా. రసం పీల్చే పురుగులు ఆకుల అడుగు భాగాన్ని ఆశించడం వల్ల.. అవి పైకి ముడుచుకుపోయినట్లు శాస్త్రవేత్తలు నిర్ధారించారు. వారి సూచనతో ఎకరాకు 30 నుంచి 40 చొప్పున పసుపు, నీలిరంగు జిగురు అట్టలు ఏర్పాటు చేశాం. పై పాటుగా లీటరు నీటికి 2 ఎం.ఎల్. ఫిప్రోనిల్, లేదా 0.25 స్పైనోసాడ్, లేదా 1.2 గ్రా సైయాట్రానిలిప్రోల్, లేదా 1 ఎం.ఎల్. స్పైనోటోరం మందు సిఫార్సు చేశారు. ఆ సూచనలు పాటించడంతో సమస్య తగ్గింది.'

పోతురాజు వెంకటేశ్వర్లు, రైతు, చంద్రుగొండ

పోస్టు చేసిన వెంటనే సిఫార్సులు

వరిలో ఆకు ముడుత, కాండం తొలుచు పురుగు, బ్యాక్టీరియా ఆకు ఎండుతెగులు, పత్తిలో రసం పీల్చే పురుగు, కాండం ముక్కు పురుగు, పొగాకు లద్దె పురుగు, మిరపలో రసం పీల్చే పురుగు, జెమిని వైరస్, పచ్చ పురుగు, మొక్కజొన్నలో కత్తెర పురుగు ఇతర తెగుళ్లు ప్రధానంగా వ్యాపిస్తున్నాయి. తెగుళ్లు సోకిన చిత్రాలను వాట్సాప్ నంబరుకు పంపాలి. వెంటనే స్పందించి సస్యరక్షణకు సిఫార్సులు చేస్తాం. సుమన్ జిల్లా వాతావరణ విభాగం పర్యవేక్షకుడు, కేవీకే

# కరవుకు చెక్‌డ్యాంలు

వరంగల్ : వాన నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంచాలనే ఉద్దేశ్యంతో తలపెట్టిన చెక్‌డ్యాం నిర్మాణాలు సత్ఫలితాలనిస్తున్నాయి. భూగర్భ జలాలు పెరగడంతో కరవు నేలల్లో రైతన్నల ఆశలు చిగురిస్తున్నాయి. నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ భూములు సాగులోకి వచ్చాయి. చెక్‌డ్యాంల చుట్టుపక్కల 5 చదరపు కిలోమీటర్ల మేర నీటి ఊట పెరిగి వట్టిపోయిన బోర్లు తిరిగి నీటిని తోడేస్తున్నాయి. గతంలో నిర్మించిన 30 చెక్‌డ్యాంలతో కలిగిన ప్రయోజనాలను గుర్తించిన ప్రజాప్రతినిధులు జిల్లాలో మరో 13 చెక్‌డ్యాంలు నిర్మించాలని అధికారులను ఆదేశిస్తూ, అనుమతులను మంజూరు చేసింది.

గతంలో నిరుపయోగంగా వాగులు

దేవరుప్పుల మండలంలో కోలుకొండ నుంచి మన్‌పహాడ్ వరకు యశ్వంతాపూర్ వాగు విస్తరించింది. ఇంత పెద్ద వాగుపై కేవలం చౌడూరు సమీపంలో ఒక్క చెక్‌డ్యాం నిర్మించడంతో ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఫలితంగా దేవరుప్పుల మండలంలోని వివిధ గ్రామాల్లో విస్తరించిన వాగు పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో యాసంగి పంట వేయడానికి రైతులు సందేహపడేవారు. వరద నీరు పూర్తిగా సూర్యాపేట జిల్లాలోని సోలిపేట చెరువులోకి చేరేది. ఈ కారణంగా యాసంగి పంట కోతల సమయంలో నీరు అందక పంటలు ఎండిపోయిన సందర్భాలు చాలా ఉన్నాయి. దీంతో యాసంగిలో రైతులు పొలాలను వదిలివేసేవారు.

కలిసొచ్చిన అవకాశం

దేవరుప్పుల మండలంలో విస్తరించిన యశ్వంతాపూర్ వాగు ప్రాధాన్యతను మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గుర్తించి, జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో చెక్‌డ్యాంల నిర్మాణాలకు అనువైన స్థలాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. పాలకుర్తి నియోజకవర్గంలో 18, స్టేషన్ ఘన్‌పూర్‌లో 5, జనగామలో 7 చోట్ల ప్రదేశాలను గుర్తించి నివేదిక తయారు చేశారు. పనులను పూర్తి చేయడంతో ప్రస్తుతం భూగర్భ జలాలు అధికంగా పెరిగాయి.

జిల్లాలో మరో 13...

జిల్లాలో ఉన్న మూడు నియోజకవర్గ పరిధిలో 13 చెక్‌డ్యాంలను నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకు ప్రభుత్వం రూ.84.92 కోట్లను మంజూరు చేసింది. వీటి నిర్మాణం పూర్తయితే దాదాపు 7060 ఎకరాలకు సాగు నీరు అందుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. త్వరలోనే పనులు ప్రారంభించి వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు.

మంత్రి చొరవతో దక్కిన అవకాశం

- పల్లా భార్గవి, జడ్పీటీసీ సభ్యురాలు

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చొరవతోనే ఎనిమిది చెక్‌డ్యాంల నిర్మాణం పూర్తయింది. కరువు నేలగా ఉన్న దేవరుప్పుల సస్యశ్యామలంగా మారింది. వాగు పరివాహక ప్రాంతంలో సాగు విస్తీర్ణం పెరిగింది. చెక్‌డ్యాంలతో పాటు మండలంలోని వివిధ చెరువులను అనుసంధానం చేస్తూ త్వరలో కాల్వల నిర్మాణం చేపడతాం.

నిర్మాణాలతో సత్ఫలితాలు

- ఎర్రబెల్లి దయాకర్‌రావు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి


భూగర్భ జలాలు పెరగడానికి చెక్‌డ్యాంలు ఉపకరిస్తాయి. త్వరలోనే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అధికారులతో సర్వే చేసి మరిన్ని చెక్‌డ్యాంలు నిర్మించడానికి కృషి చేస్తాం. పాలకుర్తి నియోజకవర్గంలో నిర్మించిన 18 చెక్‌డ్యాంలు మత్తడి పోయడం సంతోషాన్ని కలిగించింది. ఇటీవల మంజూరైన చెక్‌డ్యాంలకు త్వరలోనే శంకుస్థాపన చేసి పనులు పూర్తిచేసి అందుబాటులోకి తెస్తాం.

# క్రమబద్ధీకరణలో కదలిక

నల్గొండ : అనధికార లేఅవుట్లల్లోని ఇళ్ల స్థలాల(ప్లాట్ల) క్రమబద్ధీకరణకు ప్రవేశపెట్టిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో 19 పురపాలికలు ఉండగా నందికొండ మినహా మిగతా 18 పట్టణాల్లో 10 నవంబరు 2020 వరకు ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ పేరిట దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. దరఖాస్తుతో పాటు రూ.1000 చొప్పున ప్రభుత్వం రుసుము వసూలు చేసింది. మొత్తం పూర్వ జిల్లా పరిధిలో 2.54 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వివిధ కారణాలతో రెండున్నరేళ్లుగా వాటిని పెండింగ్‌లో ఉంచారు. తాజాగా పురపాలికల్లోని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పరిశీలించాలన్న ఉన్నతాధికారుల సూచనలతో అధికారులు పది రోజులుగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు.

రెండు సార్లు అవకాశం

భారాస ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2015లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు స్వీకరించింది. అప్పట్లో ప్రతి దరఖాస్తుతోపాటు రూ.10,000 చొప్పున ఫీజు వసూలు చేశారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 20 వేల దరఖాస్తులు వచ్చాయి. రెండేళ్ల పాటు వాటిని పరిశీలించి చాలా వరకు క్రమబద్ధీకరించారు. 2019లో మరోసారి ఫీజు చెల్లించిన వారి ప్లాట్లనూ క్రమబద్ధీకరించారు. అందులో ఇంకా మూడు వేల మంది దరఖాస్తుదారులు ముందుకు రాకపోవడంతో పక్కన పెట్టారు. రెండో విడతలో 2019లో ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని ప్రభుత్వం తెరమీదకు తీసుకొచ్చింది. రూ.1000 ఫీజుతో దరఖాస్తులు స్వీకరించింది. అప్పుడు



ఉమ్మడి జిల్లాలో 2.54 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఎల్‌ఆర్‌ఎస్‌పై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. అది ఇంకా తేలకుండానే ప్రభుత్వ మౌఖిక ఆదేశాలతో దరఖాస్తులు పరిశీలించి క్రమబద్ధీకరణకు శ్రీకారం చుట్టారు. అయితే రూ.1000 చెల్లించిన దరఖాస్తుదారులకే ప్రాధాన్యమిస్తున్నారు. గతంలో రూ.10,000 చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఎదురుచూస్తున్న దరఖాస్తులను పట్టించుకోకపోవడంతో వారు నిరాశతో ఉన్నారు.

భారీగా సమకూరనున్న ఆదాయం

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. అదే స్థాయిలో ప్రజలపై ఆర్థిక భారం పడనుంది. అనుమతి లేని ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ సమయంలో ఉన్న ప్లాటు మార్కెటు విలువలో 14 శాతం రుసుము వసూలు చేస్తోంది. అది తమకు పెనుభారమని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక కుటుంబానికి పది ప్లాట్లు ఉంటే అందులో ఒకటి విక్రయించి వచ్చిన సొమ్ముతో మిగతా ప్లాట్లు క్రమబద్ధీకరించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పిల్లల పెళ్లిళ్లు, భవిష్యత్ అవసరాల పేరిట కొందరు 20, 30 ఏళ్ల కింద ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఉన్నారు. ఇప్పుడు ఎల్‌ఆర్‌ఎస్‌కు వసూలు చేస్తున్న రుసుము నాటి ప్లాట్ కొనుగోలుకు ఎన్నో రెట్లు ఎక్కువ ఉందని వాపోతున్నారు.

ప్రస్తుతానికి పట్టణాల్లోనే..

లక్ష్మీనారాయణ, పట్టణ, గ్రామీణ ప్రణాళికాధికారి, నల్గొండ

ప్రస్తుతానికి పట్టణాల్లోని ప్లాట్ల దరఖాస్తులు మాత్రమే పరిశీలించాలని ఆదేశాలు ఉన్నాయి. పరిశీలన ప్రక్రియ ప్రారంభమైంది. మార్గదర్శకాలకు లోబడి అన్ని సక్రమంగా ఉన్న దరఖాస్తులను మాత్రమే పరిశీలించి క్రమబద్ధీకరణకు ప్రభుత్వానికి పంపిస్తాం. చెరువులు, కుంటలు, గుట్టలు, రైల్వే లైన్ల వెంట ఉన్న వాటిని క్రమబద్ధీకరించడం లేదు. వాటిపై తదుపరి ఆదేశాల తర్వాత ముందుకు వెళ్తాం.

# పంటల రుణ పరిమితి ఖరారు

సూర్యాపేట : పంటల సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఏటా రైతులకు రుణం అందిస్తూ తిరిగి సకాలంలో చెల్లించేలా ప్రోత్సహిస్తోంది. తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ (టెస్కాబ్) ఆధ్వర్యంలో రుణ లక్ష్యాన్ని విధించి వారికి పంటల వారీగా రుణాలు అందిస్తున్నారు. రుణాలు ఇవ్వడానికి రాష్ట్ర వ్యాప్తంగా 123 రకాల పంటలు ఎంపికైన జాబితాలో ఉండగా, ప్రస్తుతం 70 రకాలు సాగవుతున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు ఆయా పంటల సాగు చేసిన రైతులకు రుణాలు అందించేలా ప్రణాళిక రూపొందించారు. వచ్చే వానాకాలం పంటలకు బ్యాంకర్లు ఇచ్చే పంటల రుణపరిమితి ఖరారు చేశారు.

రూ.2 వేల నుంచి రూ.6 వేల వరకు పెంపు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 19,31,419 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. అందులో చాలా వరకు రైతులు ఆయా పంటలకు సంబంధించి రుణాలు పొందారు. సకాలంలో చెల్లించిన వారికి వచ్చే సంవత్సరంలో సాగు చేసే పంటలకు రుణం అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. రుణ ప్రణాళికను తయారు చేసి నాబార్డు, వ్యవసాయ శాఖలకు నెల రోజుల క్రితమే నివేదిక పంపించారు. సదరు నివేదిక ఆధారంగా నాబార్డు ఖరారు చేసింది. వానాకాలం సాగుకు రెండు నెలల ముందుగానే తుది జాబితా ప్రకటించారు. గత ఏడాదితో పోలిస్తే అన్ని రకాల పంటలకు రూ.2 వేల నుంచి రూ.6 వేల వరకు రుణం పెంచి అందించేలా కసరత్తు చేశారు.

కూరగాయల పంటలకూ..

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా కొద్ది రకాల పంటలు మాత్రమే సాగు అవుతున్నాయి. అందులో వరి, పత్తి, కంది, పెసర, శనగ, వేరుసెనగ, మిరప పంటలు ఇందులో ఉన్నాయి. అక్కడక్కడ ఉల్లి, మొక్కజొన్న, సోయాబీన్ తదితర పంటలు సాగు చేస్తున్నారు. ఇవి కాకుండా ఉద్యాన పంటల వైపు రైతులు దృష్టి సారించారు. ప్రధానంగా మామిడి, నిమ్మ, జామ, బత్తాయి తోటలు సాగు చేస్తుండగా, ప్రస్తుతం ఆయిల్‌పామ్‌పై దృష్టి సారిస్తున్నారు. కూరగాయల సాగును ప్రోత్సహించడంలో భాగంగా వారికి కూడా రుణం అందించేందుకు ఈ సారి ప్రభుత్వం ముందుకు వచ్చింది.

సద్వినియోగం చేసుకోవాలి: రామారావు నాయక్, జిల్లా వ్యవసాయాధికారి, సూర్యాపేట

టెస్కాబ్ ఆధ్వర్యంలో బ్యాంకులు రైతులకు రుణం సౌకర్యం కల్పిస్తున్నాయి. ఈ సారి రెండు నెలలు ముందే రుణ ప్రణాళిక ఖరారు చేసింది. ఈ సమయాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని రుణం తీసుకోవాలి. ఉద్యాన, కూరగాయ పంటలకూ రుణం తీసుకోవడానికి అవకాశం ఉంది.

# యంత్రం పదిలం.. ఆపరేటర్ క్షేమం




పెద్దపల్లి: గత ఏడాది ఓసీపీ-1లో డంపర్ ప్రమాదానికి గురై ఆపరేటర్ శ్రీనివాసరావు మృతి చెందాడు. తెల్లవారు జామున పొగమంచు ఉండటంతో ఆగి ఉన్న డంపర్‌ను ఢీకొట్టడంతో దాని వెనుక భాగం క్యాబిన్‌లోకి చొచ్చుకువచ్చి ఆపరేటర్ అందులోనే దుర్మరణం చెందాడు. డంపర్ నడిపించే ఆపరేటర్ క్యాబిన్‌కు ముందు కేవలం అద్దం మాత్రమే ఉంటుంది. ప్రమాదానికి గురైన సమయంలో రక్షణ లేకుండా పోతుంది. దీంతో ఆపరేటర్ ముందుగా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఏడాదిన్నర క్రితం ఇదే విధంగా మరో డంపర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓసీపీ-3లో ఆపరేటర్ మృతి చెందాడు. ఈ సంఘటన సైతం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఉదయం సమయంలో ఉపరితల గని క్వారీల్లో పొగ మంచు ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో ఆపరేటర్లకు ముందు స్పష్టంగా కనిపించదు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది.

సింగరేణి ఉపరితల గనుల్లో ఎక్కువ శాతం డంపర్లు ఢీకొన్న ప్రమాదంలో ఆపరేటర్లు మృతి చెందుతుండటంతో పాటు కొంత మంది తీవ్రంగా గాయపడి ప్రాణాలతో బయటపడుతున్నారు. తెల్లవారు జామున క్వారీల్లో పొగ మంచుతో పాటు రాత్రంతా ఆపరేటింగ్ విధులు నిర్వహించడం వల్ల నిద్ర ముంచుకొస్తుంటుంది. దీంతో ఎక్కువగా తెల్లవారు జామున ప్రమాదాలు చోటు చేసుకుంటుంటాయి. ఆపరేటర్‌లకు రక్షణతో పాటు డంపర్ ఎక్కువ శాతం దెబ్బతినకుండా అధికారులు సరికొత్త ప్రయోగం చేస్తున్నారు. ప్రస్తుతం ఓసీపీ-3లో దీనిని మొదలు పెట్టారు. డంపర్ క్యాబిన్ ముందు భాగంలో ఇనుప రాడ్డులతో ఫ్రేమ్‌ను అమర్చుతున్నారు. డంపర్ ప్రమాదానికి గురైనా క్యాబిన్ ముందు భాగంగా ఎక్కువగా దెబ్బతినకుండా ఉండేందుకు ఈ ప్రయోగం చేస్తున్నారు. దీంతో క్యాబిన్‌కు రక్షణ ఉంటుంది. ఫలితంగా ఆపరేటర్ ప్రమాదానికి గురికాకుండా ఉండే అవకాశం ఉంది. ప్రమాదవశాత్తు ఎదురుగా ఉన్న డంపర్‌ను ఢీకొన్నప్పటికీ ముందు ఏర్పాటు చేసిన ఇనుప ఫ్రేమ్ కొంత వరకు ప్రమాద తీవ్రతను నిరోధించనుంది. ఇనుప ఫ్రేమ్ క్యాబిన్‌కు రెండు ఫీట్ల దూరం నుంచి ఏర్పాటు చేస్తున్నారు. ఒకవేళ ప్రమాదవశాత్తు ఢీకొన్న పక్షంలో ముందుగా ఇనుప ఫ్రేమ్‌పై ఒత్తిడి పడుతుంది. దాని నుంచి లోపలికి వచ్చే సరికి తీవ్రత తగ్గుతుంది.

అన్ని ప్రాంతాల్లో అమలుకు యోచనప్రమాదవశాత్తు ఎదురుగా ఉన్న డంపర్‌ను ఢీకొన్నా ఫ్రేమ్ వల్ల తీవ్రత తగ్గి ఆపరేటర్ సురక్షితంగా బయటపడే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఓసీపీ-3లో ఈ ప్రయోగాన్ని మొదలు పెట్టారు. దీనిని సింగరేణి వ్యాప్తంగా అన్ని ఉపరితల గనుల్లో అమలు చేసేందుకు యాజమాన్యం ఆలోచిస్తోంది. ముందుగా 100, 80 టన్నుల డంపర్లకు ఇనుప ఫ్రేమ్‌ను తయారు చేస్తున్నారు. ఆ తర్వాత తక్కువ సామర్థ్యం కలిగిన డంపర్లకు సైతం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. కోట్ల రూపాయల విలువ చేసే డంపర్లకు ఇది రక్షణగా ఉండనుంది. ప్రమాదానికి గురైన సమయంలో వాహనంలోని లోపలి భాగాలు దెబ్బతినకుండా ఉండే అవకాశముంది.

# బడి తెరిచే నాటికి సిద్ధం



పెద్దపల్లి : వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేలా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. యూడైస్ నివేదిక ఆధారంగా అవసరమైన పుస్తకాలను ముద్రిస్తున్నారు. కొన్నేళ్లుగా ఏటా సగం విద్యాసంవత్సరం ముగిసిన తర్వాత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేవారు. ఈ సారి పుస్తకాల కొరత లేకుండా ముందస్తుగా లక్ష్యాలను అనుగుణంగా జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. ఒకే పుస్తకంలో తెలుగు, ఆంగ్ల, ఉర్దూ మాధ్యమాల్లో ముద్రించే బైలింగ్వెల్ విధానాన్ని గతేడాది అమలు చేయగా ఈసారి కూడా కొనసాగిస్తున్నారు. ఇప్పటికే 40 శాతానికి పైగా పాఠ్యపుస్తకాలు జిల్లాలకు చేరాయి. జూన్ మొదటి వారంలో మండల కేంద్రాల నుంచి పాఠశాలలకు తరలించనున్నారు.

ద్విభాష.. క్యూఆర్ కోడ్

గతంలో పాఠ్యపుస్తకాలను ఒకే మాధ్యమంలో ముద్రించేవారు. ప్రస్తుతం పుస్తకంలో ఒకవైపు తెలుగు, మరోవైపు ఆంగ్లంలో ముద్రణ ఉంటుంది. దీంతో తెలుగు మాధ్యమం నుంచి ఆంగ్లంలో చదువుకోవడం సులభంగా ఉంటుంది. గత సంవత్సరం తొలిసారిగా 3 నుంచి 8 తరగతుల వరకు ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. ప్రస్తుతం తొమ్మిదో తరగతి వరకు అమలవుతోంది. పిల్లలు తమకు అర్థం కాని విషయాలను తెలుగు, ఆంగ్ల భాషల్లో చదువుకుంటున్నారు. ప్రతి పాఠానికి రెండు వైపులా తెలుగు, ఆంగ్లంలో ముద్రించడంతో విద్యార్థులకు విజ్ఞానం పెరుగుతుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడంతో పాఠ్యాంశాలకు సంబంధించి లోతైన పరిజ్ఞానం తెలుసుకుంటున్నారు.

సకాలంలో విషయ పరిజ్ఞానం

ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు విడతల వారీగా చేరుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 17,08,910 పాఠ్యపుస్తకాల అవసరం ఉంది. ఇందులో ఆయా జిల్లాల్లో గతేడాదికి సంబంధించి 1,03,070 పుస్తకాలు మిగులు నిల్వ ఉండగా మిగిలిన 16,05,840 పుస్తకాలు సరఫరా అవుతున్నాయి. బైలింగ్వెల్ విధానంలో ముద్రణ నేపథ్యంలో కొంత ఆలస్యం జరుగుతోంది. ఎలాంటి సమస్యలు లేకుండా పుస్తకాలు సరఫరా చేస్తే విద్యార్థులకు సకాలంలో విషయ పరిజ్ఞానం అందనుంది. జూన్ నెలలో బడిబాట సందర్భంగా పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, కార్పొరేట్ స్థాయిలో విద్యా బోధన అందుతుండటంతో సర్కారు బడులకు ఆదరణ పెరుగుతోంది.

కొరత లేకుండా పంపిణీ

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఉచిత పాఠ్యపుస్తకాలు అందిస్తున్నాం. బడుల ప్రారంభం నాటికి అన్ని చోట్లకూ పంపిస్తాం. జిల్లాలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు వస్తున్నాయి. వాటిని జిల్లాకేంద్రంలో భద్రపరుస్తున్నాం. ఎక్కడా కొరత లేకుండా పంపిణీ చేస్తాం. బైలింగ్వెల్ పుస్తకాలతో సామర్థ్యాలు మెరుగుపడుతున్నాయి. మాధవి, జిల్లా విద్యాధికారి, పెద్దపల్లి

# యార్డు వెలుపలే కాయల సేకరణ

జగిత్యాల : జగిత్యాల వ్యవసాయ మార్కెట్యార్డు పరిధి చల్‌గల్‌లోని మామిడి మండీ పరిధిలో కాయల కొనుగోలులో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మామిడి మార్కెట్లో రూ.6 కోట్ల వ్యయంతో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన నాలుగు భారీ షెడ్లు అందుబాటులోకి రావటం, చల్‌గల్ వాలంతరి ప్రదర్శన క్షేత్రం నుంచి 10 ఎకరాల స్థలాన్ని మామిడి మండీకి తీసుకోవటంతో ఈ సీజనులో వ్యాపారులందరూ యార్డులోకి రావాల్సిందేనని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గతంలో మాదిరిగా యార్డు వెలుపల తమ సొంత స్థలాలు, ప్రైవేటు అద్దెస్థలాల్లో కొనుగోళ్లు జరపవద్దని, వ్యాపారులందరూ తప్పనిసరిగా యార్డులోనే ఏర్పాట్లు చేసుకోవాలని మార్కెటింగ్ అధికారులు వ్యాపారులకు నెలరోజుల క్రితమే నోటీసులు జారీచేశారు. ఇందుకు అనుగుణంగా గత సీజన్‌లో మార్కెట్ఫీజు చెల్లించిన వ్యాపారులకు వరుసక్రమంలో మార్కెట్లోని షెడ్లలో స్థలాన్ని కేటాయించారు. ఐనా కూడా ఇప్పటికీ దాదాపుగా 17 మంది వ్యాపారులు యార్డు వెలపలే మామిడి కాయల క్రయవిక్రయాలను జరుపుతుండటంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

మార్కెట్ ఫీజు చెల్లిస్తున్నారా?

వ్యాపారులు కొనుగోలు చేసిన సరకును ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు మార్కెటింగ్‌శాఖ తక్‌పట్టీ తప్పనిసరిగా కావాలి. కొనుగోలు చేసిన కాయల విలువను అనుసరించి మార్కెట్ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. కానీ వ్యాపారులు యార్డులోకి రానందున అధికారులు వారికి తక్‌పట్టీల పుస్తకాలను ఇవ్వలేదు. ఐనాకూడా కొందరు వ్యాపారులు చెక్‌పోస్టులవద్ద కొంత ఫీజును చెల్లించి మామిడి కాయలను ఎగుమతి చేస్తున్నారు. ఇప్పటికే 27 వేల క్వింటాళ్ల వరకు మామిడి కాయలను కొనుగోలు చేశారు. దీంతో విలువకు సమానంగా ఫీజును చెల్లిస్తున్నారా లేక విలువను తగ్గించి తక్కువఫీజు చెల్లిస్తున్నారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు మార్కెటింగ్‌శాఖ స్థానిక తక్‌పట్టీ పుస్తకాల్లో రికార్డు లేకుంటే వచ్చే సంవత్సరం షెడ్ల కేటాయింపు సక్రమంగా ఉండదు. ప్రైవేటుగా సేకరణ జరిపినపుడు అధికారుల ఆజమాయిషీ కొరవడుతుంది, తూకం, ధరల చెల్లింపు తదితరాల్లోనూ అవకతవకలు జరిగే అవకాశముంది.

ఈసారీ అటకెక్కిన బహిరంగ వేలం

నిబంధనల ప్రకారం రైతుల నుంచి కమీషన్ తీసుకునే వ్యాపారులు తప్పనిసరిగా కాయలను బహిరంగ వేలం పద్ధతిన కొనుగోలు చేయాలి. కానీ నిరుటి వరకు కమీషన్ తీసుకున్నా కూడా మండీలో పక్కాషెడ్లు అందుబాటులో లేవన్న కారణంచూపి వ్యాపారులు బహిరంగ వేలాన్ని పాటించలేదు. ఈ సారి యార్డులోనే కొనుగోళ్లు జరపాలని, వేలం పద్ధతిని పాటించాలని నిర్ణయించినా వ్యాపారులందరూ యార్డులోకి రాకపోవటంతో ఇక బహిరంగ వేలం ఈ సీజన్‌లోనూ అమలయ్యేలాలేదు. నాగ్‌పూర్ మామిడి మార్కెట్ మాదిరిగా కాయలను బహిరంగ వేలంలో కొనుగోలు చేస్తే వ్యాపారుల మధ్య పోటీపెరిగి ధరలుహెచ్చి రైతులు, తోటల గుత్తేదారులకు లాభించే అవకాశమున్నా వేలం అమలు చేయటం లేదు. మరోవైపు తరుగు, చిన్నకాయలు, మంగు తదితరాలపేరిట కోతలు రివాజుగా మారగా ధరల స్థిరత్వానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జిల్లా కలెక్టర్‌కు నివేదిక – టి.రాజశేఖర్, మార్కెట్ కార్యదర్శి, జగిత్యాల

వ్యాపారులందరూ చల్‌గల్ మామిడి యార్డులోకి రాకపోవటంపై జిల్లా కలెక్టర్‌కు నివేదించాం. కలెక్టర్ ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకుంటున్నాం. కొనుగోలు చేసిన కాయల విలువ ప్రకారంగా ఫీజు వసూలు చేస్తాం.

# సమాఖ్య.. స్వాహాపర్వం

ఏర్గట్ల: గ్రామీణ మహిళా ఆర్థిక సాధికారతే లక్ష్యంగా పని చేయాల్సిన డ్వాక్రా సంఘాలు అవినీతి బాట పడుతున్నాయి. బ్యాంకు రుణాల చెల్లింపుల్లో మహిళా సంఘాల ప్రతినిధులతో పాటు, సిబ్బంది చేతివాటం చూపుతున్నారు. సంఘాల సొమ్ము సొంత అవసరాలకు వాడుకుంటూ అమాయకులైన మహిళలను మోసం చేస్తున్నారు. ఇటీవల వెల్కటూర్, ఏర్గట్ల గ్రామ సమాఖ్యల్లో వెలుగుచూసిన అవినీతి ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తోంది. ఏర్గట్లలో స్వప్న గ్రామ మహిళా సంఘం రూ.5 లక్షల బ్యాంకు లింకేజీ రుణం తీసుకుంది. పది మంది సభ్యులు సంఘం అధ్యక్షురాలు లక్ష్మికి ప్రతినెల వాయిదా చెల్లిస్తున్నారు. కానీ, సదరు మహిళా ఆ డబ్బులను బ్యాంకులో చెల్లించకుండా తన సొంత అవసరాలకు వాడుకుంది. వరుసగా 11 నెలలకు సంబంధించిన రూ.3.29 లక్షల కిస్తీని(వాయిదా) స్వాహా చేసింది. విషయం బయటపడి సభ్యులు ఒత్తిడి చేయడంతో రూ.1.60 లక్షలు చెల్లించింది. మిగతా సొమ్ము రూ.1.69 లక్షలు చెల్లించకపోవడంతో సభ్యులు ఈ నెల 22న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మెండోరా మండలం వెల్కటూర్‌లో గతేడాది ఐకేపీ వీఏవో, సీఏ కలిసి సంఘాల సభ్యులు చెల్లించిన సొమ్మును బ్యాంకులో చెల్లించకుండా స్వాహా చేశారు. అవినీతి బయటకు రావడంతో జిల్లా అధికారులు స్పందించి విచారించారు. ఇద్దర్నీ విధుల్లో నుంచి తొలగిస్తూ సొమ్ము రికవరీకి ఆదేశించారు.

కంచె చేను మేసిన చందంగా..

జిల్లాలో 825 గ్రామ సంఘాలు ఉండగా వాటిలో 24,030 సంఘాలు, 2,38,511 మంది సభ్యులున్నారు. వీరంతా పొదుపు చేస్తూ ఏటా బ్యాంకుల నుంచి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు తీసుకుంటున్నారు. ప్రతి నెల వాయిదాలు చెల్లిస్తున్నారు. ఈ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించడానికి గ్రామస్థాయిలో ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటైంది.




వీరిలో సంఘం అధ్యక్షురాలు, వీవోఏలు, సీఏలు, ఏపీఎంతో పాటు బ్యాంకు ఫీల్డ్ సిబ్బంది ఈ లావాదేవీలను పర్యవేక్షిస్తూ అవినీతికి ఆస్కారం లేకుండా చూడాలి. కానీ, కంచె చేను మేసిన చందంగా సంఘం అధ్యక్షురాళ్లు, సిబ్బందే అవినీతికి పాల్పడుతున్నారు. దీంతో అమాయకులైన సభ్యులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లాస్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని సంఘాల మహిళలు భావిస్తున్నారు.

రికవరీ చేయిస్తాం

రూ.3.29 లక్షలకు గానూ రూ 1.60 లక్షలు రికవరీ చేశాం. మిగిలిన రూ 1.69 లక్షలను రికవరీ చేయడానికి ప్రయత్నిస్తున్నాం. సంఘ సభ్యులకు నష్టం జరగకుండా చూస్తాం. ఇతర సంఘాల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పర్యవేక్షణ బలోపేతం చేస్తాను. శ్యాం, ఏపీఎం, ఏర్గట్ల

నిబంధనలు ఇవీ..

సంఘం సభ్యులు చెల్లించిన కిస్తీని అధ్యక్షురాలు వసూలు చేసి ప్రతినెల ఒక సభ్యురాలితో బ్యాంకులో కట్టించాలి. కానీ, చాలా సంఘాల్లో అధ్యక్షురాలే ఖాతాల్లో జమ చేస్తున్నారు.

వాయిదా చెల్లించిన తర్వాత కౌంటర్ ఫైల్ తీసుకోవాలి. సంఘం ఖాతా పుస్తకంలో చెల్లించిన నగదును నమోదు చేయించాలి. కౌంటర్ ఫైల్ తీసుకోకపోగా ఖాతా పుస్తకంలో నమోదు చేయించడం లేదు.

ప్రతి నెల చెల్లించిన కిస్తు కౌంటర్ ఫైల్, ఖాతా పుస్తకాన్ని ప్రతి నెల గ్రామ సంఘంలో జరిగే సమావేశంలో వీవోఏలు తనిఖీ చేసి వివరాలు నమోదు చేసుకోవాలి. కానీ, వీవోఏల నిర్లక్ష్యం, సీఏల పర్యవేక్షణ లోపం కారణమవుతోంది. మూడు నెలలుగా వాయిదాను బ్యాంకులో చెల్లించకపోతే బ్యాంకు మేనేజర్ లేదా ఫీల్డ్ అధికారి నేరుగా సంఘాల డ్యూలిస్టును సీఏకు పంపించాలి. 6 నెలలైతే ఏపీఎంకు సంఘాల అప్పు జాబితాను అందించాలి. బ్యాంకుల్లో పని ఒత్తిడి పేరుతో అధికారులు నెలల తరబడి అప్పు జాబితా ఏపీఎంకు అందించడం లేదు.

# సరిహద్దుల్లో అక్రమ దందా

ఇందూరు : మహారాష్ట్ర నుంచి జిల్లాకు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న యువకులను తాజాగా నగర పోలీసులు పట్టుకొన్నారు. గతంలో దేశీదారు నిల్వలను సైతం సీజ్ చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో గతంలో ఎక్సైజ్‌శాఖ జరిపిన సోదాల్లోనూ.. దేశీదారు, గంజాయి నిల్వలు స్వాధీనం చేసుకొన్నారు. మహారాష్ట్ర సరిహద్దు కేంద్ర బిందువుగా వీటి అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలుస్తోంది.

దేశీదారు.. రాష్ట్రంలో నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్(ఎన్‌డీపీఎల్) కిందకు వస్తుంది. స్థానికంగా ఈ మద్యాన్ని విక్రయించొద్దు. కానీ, కొందరు యథేచ్ఛగా నిజామాబాద్‌కు ఈ మద్యాన్ని తీసుకొచ్చి వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తోంది. సమీపంలోని ధర్మాబాద్ నుంచి బాసర మీదుగా జిల్లాకు దేశీదారు నిల్వలు రవాణా అవుతున్నట్లు సమాచారం. నాందేవ్‌వాడ, హమాల్‌వాడి, ఖిల్లా చౌరస్తాలో ఇప్పటికి కొందరు దీన్ని విక్రయిస్తున్నట్లుగా ప్రచారం ఉంది. గతంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఎక్సైజ్‌శాఖ అధికారులు,



సిబ్బంది గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపారు. గంజాయి సాగుచేస్తున్న వారిని సైతం ప్రత్యేకంగా గుర్తించారు. రైతుబంధు రాకుండా చర్యలు చేపట్టారు. అయినా తిరిగి పలు తండాల్లో గంజాయి సాగు జరుగుతుందని, వివిధ ప్రాంతాల నుంచి యువత వచ్చి కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం.

కేవలం ఐదు కేసులే నమోదు..నిజామాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది కేవలం ఐదు కేసులు నమోదయ్యాయి. వాస్తవానికి ఈ స్టేషన్ పరిధిలో అధికారులు, సిబ్బంది మధ్య సయోధ్య లేక మూడు నెలల పాటు ఎక్కడా తనిఖీలు చేపట్టలేదు. జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తున్నారు. అయితే స్టేషన్ల సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ బృందం సమన్వయంతో పనిచేస్తే పెద్దమొత్తంలో కేసుల నమోదుకు ఆస్కారం ఉంటుంది. అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేయొచ్చు.

# సీఎం జగన్ పాలనలో సామాజిక విప్లవం: వైఎస్సార్‌సీపీ నేతలు



విజయనగరం: సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమైందని వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు. విజయనగరం నుంచి రెండోరోజు వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో మంత్రులు బూడి ముత్యాల నాయుడు, బొత్స సత్యనారాయణ, మేరుగ నాగార్జున, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు పుష్ప శ్రీవాణి, అలజంగి జోగరావు, శంబంగి చిన్న అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాస రావు, జిల్లా వైస్సార్సీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మేయర్ వెంపడపు విజయలక్ష్మి పాల్గొన్నారు. "విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. విజయనగరంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. అట్టడుగు వర్గాలకు సీఎం జగన్ అండగా నిలిచారు. నాలుగున్నరేళ్లుగా సీఎం జగన్ సంక్షేమ పాలన అందించారు. జరిగిన అభివృద్ధిని బస్సు యాత్ర ద్వారా ప్రజల్లోకి తీసుకెళుతున్నాం. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని సీఎం జగన్ నెరవేర్చారు. మేం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నాం. అవినీతికి చోటు లేకుండా సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించాం. వెనుకబడిన వర్గాలకు ఆర్థిక చేయూతనందించాం" వైఎస్సార్‌సీపీ నేతలు అని పేర్కొన్నారు. "గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదు. టీడీపీ చేసిన అవినీతిని ప్రజల్లోకి తీసుకెళతాం. బీసీ, ఎస్సీ, మైనార్టీలకు పెద్దపీట వేసిన నాయకుడు సీఎం జగన్. అందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్న అంబేద్కర్ స్ఫూర్తిని జగన్ కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వం బలహీనవర్గాలను నిలువునా మోసం చేసింది. దళితుల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా అంటూ చంద్రబాబు హేళన చేశారు. సీఎం జగన్ పాలనలో సామాజిక విప్లవం వికసిల్లుతోంది." వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొన్నారు.



**జగన్ పాలనలో సామాజిక సమతుల్యత: మంత్రి బొత్స :** సామాజిక సాధికార యాత్ర ద్వారా సీఎం జగన్ పాలనలో ఏ విధంగా సామాజిక సమతుల్యత సాధించామో వివరిస్తామని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. రాష్ట్రంలో రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్రలో సామాజిక సాధికార జరుగుతుంది. చంద్రబాబులా మోసం చేయం. చెప్పిందే చేయడం, చేసిందే చెప్పడం సీఎం జగన్ నైజం. నూటికి 99 శాతం మేనిఫెస్టో అమలు చేశాం. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బీజేపీలు 650 వాగ్దానాలు చేశారు. చంద్రబాబు 2014 జూన్‌లో ప్రమాణ స్వీకారం చేసి, అదే రోజున చేసిన సంతకాలు అమలు కాలేదు. మహిళల రుణమాఫీ, బెల్ట్ షాప్‌ల నియంత్రణ అమలు చేయలేదు. వంచనదారుల మాటలు నమ్మొద్దు. సంక్షేమ పథకాలను అవహేళన చేస్తున్న వారిని అమలు చేసి పేదలకు అండగా జగన్ నిలబడ్డారు. నాలుగున్నరేళ్ల లో ఏమేరకు అభివృద్ధి చేశామో ప్రజలు చూడాలని మంత్రి బొత్స కోరారు.

## చంద్రబాబు పిటీషన్‌పై విచారణ.. 'నాట్ బిఫోర్ మీ' అంటూ వైదొలిగిన న్యాయమూర్తి




అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెదేపా అధినేత చంద్రబాబు హైకోర్టులో దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై విచారణ నుంచి న్యాయమూర్తి వైదొలిగారు. ఈ పిటిషన్ దసరా సెలవుల ప్రత్యేక బెంచ్ (వెకేషన్ బెంచ్)ముందు విచారణకు రాగా.. 'నాట్ బిఫోర్ మీ' అంటూ న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప విచారణ నుంచి తప్పుకొన్నారు. దీంతో ఈ పిటిషన్‌ను ఏ బెంచ్ విచారించాలనే అంశంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నిర్ణయం తీసుకోనున్నారు. ఈ కేసులో ఏసీబీ కోర్టు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడంతో చంద్రబాబు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ నెల 19న హైకోర్టు ఈ పిటిషన్‌పై విచారణ జరిపి వెకేషన్ బెంచ్ ముందుకు వాయిదా వేసింది.

## కర్ణాటకలో రోడ్డు ప్రమాదం మృతులకు రూ.10 లక్షలు ఇవ్వాలి

విజయవాడ: కర్ణాటకలో రోడ్డు ప్రమాదంలో మరణించిన వలస కూలీల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారికి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన వలస కూలీలు 10 మంది ప్రమాదంలో మరణించారని, ఏపీలో ఉపాధి కరువవటం వల్లే పొరుగు రాష్ట్రాలకు వలసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ సర్కార్ కరువు సహాయక చర్యలు, వలసల నివారణపై ఏమాత్రం దృష్టి పెట్టలేదని విమర్శించారు. ఈ మరణాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని రామకృష్ణ అన్నారు. కాగా కర్ణాటక రాష్ట్రంలోని చిక్కబళ్లాపూర్‌లో గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో 12 మంది ఏపీ వాసులు మృతి చెందారు. ఆగి ఉన్న లారీని టాటా సుమో ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో 12 మంది మృతి చెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. బాగేపల్లి, చిక్కబళ్లాపూర్ మార్గంలో 44వ జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీ సత్య సాయి జిల్లా గోరంట్ల మండలంలోని సమీప గ్రామాలకు చెందిన వారుగా గుర్తించారు. దసరా పండుగ కోసం ఊరికి వచ్చి తిరుగు ప్రయాణంలో వెళ్తుండగా ప్రమాదం జరిగింది. మృతిచెందిన వారంతా బెంగళూరులో కూలి పనులకు




వెళ్లే కూలీలుగా తెలుస్తోంది. సమాచారం అందిన వెంటనే కర్ణాటక పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను స్థానిక ఆస్పత్రికి తరలించారు. అలాగే గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రహదారిపై పొగమంచే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. దట్టమైన పొగమంచు కారణంగా ఆగి ఉన్న లారీని డ్రైవర్ గుర్తించకపోవడంతో ఇంతటి ఘోరం జరిగింది. ఘటనా స్థలంలోనే ఐదుగురు మృతి చెందగా... ఆసుపత్రికి తరలిస్తుండగా మరో ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో ఓడిస్సాకు చెందిన భార్యాభర్తలు వెంకటనారాయణ, సుబ్బమ్మ ఉన్నారు.




బ్యాంకాక్: దక్షిణ చైనా సముద్రం మీదుగా తమ యుద్ధ విమానానికి అత్యంత సమీపంలో చైనాకు చెందిన ఓ యుద్ధ విమానం దూకుడుగా ప్రయాణించిందని అమెరికా సైన్యం వెల్లడించింది. చైనా పైలట్ చర్య రెండు విమానాలను ప్రమాదంలోకి నెట్టిందని దుయ్యబట్టింది. మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు వెల్లడించింది. ఈ ఘటనపై యూఎస్ ఇండో-పసిఫిక్ కమాండ్ తాజాగా ఓ ప్రకటన విడుదల చేసింది. "రాత్రి సమయంలో షెన్యాంగ్ జే-11 ట్విటన్ ఇంజిన్ యుద్ధ విమానం.. అమెరికా ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన విమానానికి అత్యంత దగ్గరగా ప్రయాణించింది. మా బీ-52 బాంబర్ యుద్ధ విమానానికి కేవలం 10 అడుగుల దూరం లోపలే అనియంత్రిత వేగంతో కిందకు, ముందుకు వెళ్తూ కన్పించింది. ఈ చర్య రెండు విమానాలను ప్రమాదంలోకి నెట్టింది. విమానాన్ని ఢీకొట్టేంత దగ్గరగా వచ్చిన విషయం చైనా పైలట్‌కు తెలియకపోవడం ఆందోళనకరం" అని అమెరికా సైన్యం ఆ ప్రకటనలో పేర్కొంది. దక్షిణ చైనా సముద్రంపై ఉన్న అంతర్జాతీయ గగనతలంలో నిబంధనలకు అనుగుణంగా బీ-52 సాధారణ కార్యకలాపాలు నిర్వహిస్తున్న సమయంలో జే-11 యుద్ధ విమానం దూసుకొచ్చిందని అమెరికా వెల్లడించింది. కాగా.. దీనిపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అయితే, దక్షిణ చైనా సముద్రంపై అమెరికా విమానాలను చైనా వెంబడించడం ఇదే తొలిసారి కాదు. దక్షిణ చైనా సముద్ర జలాలు, ఆ గగనతలం అంతర్జాతీయం అని చెప్పేందుకు అమెరికా, దాని మిత్ర దేశాలు తరచూ ఇక్కడ నేవీ, గగనతల విన్యాసాలు చేపడుతూనే ఉన్నాయి. అమెరికా చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న డ్రాగన్.. తరచూ ఇలాంటి ఘటనలకు పాల్పడుతోంది. ఈ ఏడాది ఆరంభంలో అమెరికా నిఘా విమానం వద్దకు ఓ చైనీస్ యుద్ధ విమానం దూసుకొచ్చింది. 2021 నుంచి ఇప్పటివరకు 180 సార్లకు పైగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని అమెరికా సైన్యం ఆరోపించింది. అయితే, ఇంత దగ్గరగా ఎన్నడూ యుద్ధ విమానాలు రాలేదని పేర్కొంది. తాజా ఘటనలో కొద్దిలో విమానాలు ఢీకొనే ప్రమాదం తప్పిందని తెలిపింది. అదే జరిగితే ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరేవని పేర్కొంది.

**కెనడా విమానాన్ని వెంబడించి..** కాగా.. చైనా మిలిటరీ జెట్.. ఇలా ఇతర దేశాల విమానాలను వెంబడించడం వారంలో ఇది రెండో ఘటన. చైనా తీరానికి సమీపంలోని అంతర్జాతీయ గగనతలంలో ప్రయాణించిన ఓ కెనడా ఆర్మ్‌డ్ ఫోర్సెస్ విమానాన్ని కూడా డ్రాగన్ ఫైటర్ జెట్ వెంబడించింది. ఉత్తరకొరియాపై విధించిన ఆంక్షల అమలును పర్యవేక్షించేందుకు వచ్చిన కెనడా నిఘా విమానాన్ని చైనా యుద్ధ విమానం పలుమార్లు అడ్డగించింది. ఒక దశలో ఆ విమానానికి కేవలం 5 మీటర్ల దూరంలోకి వచ్చి ప్రమాదకరంగా ప్రయాణించింది.




దిల్లీ: భారత్‌లో తొలి ఉపగ్రహ ఆధారిత గిగా ఫైబర్ సర్వీస్‌ను విజయవంతంగా అమలు చేసినట్లు ప్రముఖ టెలికాం సంస్థ రియలన్స్ జియో ప్రకటించింది. భారత్‌లో ఇప్పటి వరకు ఇంటర్నెట్ సదుపాయం లేని ప్రాంతాలకు దీని ద్వారా వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించనున్నట్లు తెలిపింది. జియోస్పేస్‌ఫైబర్‌గా పిలుస్తున్న ఈ సర్వీస్‌ను భారత మొబైల్ కాంగ్రెస్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో శుక్రవారం రియలన్స్ జియో విజయవంతంగా ప్రదర్శించింది. జియో ఇప్పటికే భారత్‌లో 45 కోట్ల కస్టమర్లకు ఫిక్స్‌డ్ లైన్, వైర్‌లెస్ మార్గాల ద్వారా వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందిస్తోంది. దేశంలోని ప్రతి ఇంటికీ డిజిటల్ సేవలను చేరవ చేయడంలో భాగంగానే జియోఫైబర్, జియోఎయిర్‌ఫైబర్ వంటి బ్రాడ్‌బ్యాండ్ సర్వీసుల సరసన జియోస్పేస్‌ఫైబర్‌ను కూడా చేర్చినట్లు కంపెనీ తెలిపింది. ఇప్పటికే ఎలాంటి జాప్యం లేని, వేగవంతమైన ఇంటర్నెట్‌ను, ఎంటర్‌టైన్‌మెంట్ సేవలను ప్రాంతంతో సంబంధం లేకుండా అందిస్తున్నట్లు పేర్కొంది. తాజా శాటిలైట్ నెట్‌వర్క్‌తో జియో ట్రూ5జీ సేవలు సైతం దేశంలోని ప్రతి ప్రాంతానికి అందుబాటులోకి వస్తాయని వివరించింది. ప్రపంచంలో తాజా 'మీడియం ఎర్త్ ఆర్బిట్' శాటిలైట్ టెక్నాలజీ కోసం జియో ఎస్ఈఎస్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు జియో తెలిపింది. గిగాబిట్, స్పేస్ నుంచి ఫైబర్ తరహా సేవలను అందించగల ఎంఈఓ ఉపగ్రహాల కూర్పు ఇదొక్కటేనని పేర్కొంది. తద్వారా జియోకు ఎస్ఈఎస్‌కు చెందిన ఓ3బీ, ఓ3బీ ఎంపవర్ శాటిలైట్ల నెట్‌వర్క్‌కు యాక్సెస్ లభిస్తుందని తెలిపింది. దీంతో దేశవ్యాప్తంగా అత్యంత కచ్చితత్వంతో ఈ అత్యాధునిక సాంకేతికతతో బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందిస్తున్న ఏకైక సంస్థగా జియో నిలుస్తుందని పేర్కొంది. జియోస్పేస్‌ఫైబర్ సామర్థ్యాన్ని ప్రదర్శించేందుకు ఇప్పటికే నెట్‌వర్క్‌లో గుజరాత్ గిర్, ఛత్తీస్‌గఢ్ కోర్బా, ఒడిశా నవరంగాపూర్, అసోం ఓఎన్‌జీసీ జోర్హట్ వంటి మారుమూల ప్రాంతాలను చేర్చినట్లు జియో తెలిపింది. "భారత్‌లో లక్షలాది ఇళ్లు, వ్యాపారాలకు జియో బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించాం. ఇప్పటి వరకు ఇంటర్నెట్ అనుసంధానతకు దూరంగా ఉన్న లక్షలాది మందికి కూడా జియోస్పేస్‌ఫైబర్ ద్వారా సేవలను విస్తరిస్తున్నాం. జియోస్పేస్‌ఫైబర్‌తో ఎవరైనా, ఎక్కడి నుంచైనా కొత్త డిజిటల్ సమాజంలో చేరి గిగాబిట్ యాక్సెస్‌తో ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వ, విద్య, ఆరోగ్య, వినోదాత్మక సేవలను పొందొచ్చు" అని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ లిమిటెడ్ ఛైర్మన్ ఆకాశ్ అంబానీ అన్నారు.

## భువనేశ్వరి ఓదార్పు యాత్రపై వైసీపీ కుక్కలు మొరుగుతున్నాయ్



విజయవాడ: వైసీపీ నేతలపై టీడీపీ నేత బుద్దా వెంకన్న తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ చీఫ్ చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి ఓదార్పు యాత్రపై వైసీపీ కుక్కలు మొరుగుతున్నాయని మండిపడ్డారు. అంబటి రాంబాబు అనే వ్యక్తి మొరుగుతున్నారని వ్యాఖ్యలు చేశారు. భువనేశ్వరి 40 రోజులుగా రాజమండ్రిలో ఉంటే, ప్రపంచంలో ఉన్న తెలుగు వారు ఆమెను పరామర్శించడానికి రాజమండ్రికి క్యూ కట్టారన్నారు. ఇది చూసి ఓర్వలేక వైసీపీ కుక్కలు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. "ఒరే చవట దద్దమ్మ ల్లారా.. జగన్ 16 నెలలు జైలులో ఉన్నప్పుడు తల్లీ, చెల్లి పాదయాత్ర చేయలేదా? వారిని ఏమీ చేశావు. వారికి చిన్న పదవి కూడా ఇవ్వకుండా పక్కన పెట్టారు. మీకు కనీసం ఇంగిత జ్ఞానం వుందా? దొంగతనం నుంచి పుట్టిన పార్టీ వైసీపీ పార్టీ, మీరంతా దొంగలే. బొత్స పార్టీలోకి రాక ముందు జగన్‌ను విమర్శించలేదా?. సీనియారిటీ ప్రకారం 4వ రాంక్‌లో ఉన్న ద్వారకా తిరుమల రావును డీజీపీగా నియమించకుండా.. 16 రాంక్‌లో ఉన్న రాజేంద్ర నాథ్ రెడ్డినునీ ఎందుకు నియమించారు. జగన్ పిచ్చి పరాకా ష్టకు వెళ్ళింది. వైసీపీలో 30 పిచ్చి కుక్కలు ఉన్నాయి.

పదవులన్నీ నీ సామాజిక వర్గానికి ఇచ్చి, ఇప్పుడు నా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు అని అంటున్నావు. బీసీ వర్గానికి చెందిన వ్యక్తి సున్నపు బట్టీలో పనికి చేరి, వారిని చంపి ఆస్తులు సంపాదించుకున్న చరిత్ర మీది. రాష్ట్రంలో ఏ వ్యక్తి అయినా సంతోషంగా ఉన్నారా?. పాలన చేతగాని ఏకైక వ్యక్తి జగన్మోహన్ రెడ్డిని గిన్నీస్ బుక్‌లో ఎక్కించాలి" అంటూ వ్యాఖ్యలు చేశారు.

**వెల్లంపల్లి వల్లే దుర్గమ్మ ఆదాయానికి గండి..** విజయవాడ దుర్గమ్మ దసరా ఉత్సవాల్లో వెల్లంపల్లి శ్రీనివాసరావు వల్ల అమ్మవారి ఆదాయానికి గండి పడిందని విమర్శలు గుప్పించారు. ప్రతి రోజూ వెల్లంపల్లి ఇంటి వద్ద కార్‌లు పెట్టుకుని 100 రూపాయలు టికెట్‌లు కొని 500 లైన్‌లో దర్శనాలు చేయించారన్నారు. మిగిలిన 400 రూపాయలు ఎక్కడ, ఎవరి జేబుల్లోకి వెళ్ళాయని ప్రశ్నించారు. సాక్షాత్తూ దేవాదాయ శాఖ మంత్రి... వెల్లంపల్లి అవినీతిని అరికట్టేందుకు గుడిపైన 9 రోజులు ఉండి కాపలా కాశారన్నారు. ఇటువంటి ఘటన చరిత్రలో ఎప్పుడూ లేదన్నారు. గుడిపైన ప్రతీ కాంట్రాక్ట్‌లో మామూళ్లు వెల్లంపల్లికి ఉన్నాయన్నారు. వెల్లంపల్లి అరాచకాలను సీఎం ఆరికట్టకపోతే ప్రజలలోకి తీసుకువెళ్లి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

గుడి పైకి వెళ్లి ఈవో కార్యాలయం ముందు ధర్నా చేస్తామన్నారు. దుర్గగుడిలో మూడు సింహాలు ఏమయ్యి పోయాయో సమాధానం లేదని బుద్దా వెంకన్న విరుచుకుపడ్డారు.

## పాక్షిక చంద్రగ్రహణం.. రేపు శ్రీవారి ఆలయం మూసివేత



తిరుపతి: తిరుమల శ్రీవారి ఆలయాన్ని పాక్షిక చంద్రగ్రహణం కారణంగా ఈ నెల 28న(శనివారం) మూసివేయనున్నారు. సుమారు 8 గంటల పాటు ఆలయ తలుపులు మూసి ఉంచనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం తెలిపింది. ఈ నెల 29న తెల్లవారుజామున 1.05 గంటల నుంచి 2.22 గంటల మధ్య పాక్షిక చంద్రగ్రహణం ఉండగా.. గ్రహణ సమయానికి 6 గంటల ముందు తలుపులు మూసివేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో 28న రాత్రి 7.05 గంటలకు ఆలయ తలుపులు మూసివేయనున్నారు. తెల్లవారుజామున 3.15 గంటలకు ఏకాంతంగా శుద్ధి, సుప్రభాతసేవ నిర్వహించి ఆలయ తలుపులు తెరుస్తారు. గ్రహణం కారణంగా 28న సహస్ర దీపాలంకార సేవ, వికలాంగులు, వృద్ధులకు కల్పించే స్వామివారి దర్శన సదుపాయాలను రద్దు చేసినట్లు టీటీడీ తెలిపింది.




హమాస్ నెట్‌వర్క్‌ను భూస్థాపితం చేయడమే లక్ష్యంగా గాజాలో ఇజ్రాయెల్ భీకర వైమానిక దాడులు కొనసాగుతున్నాయి. ఈ దాడుల్లో హమాస్ కీలక కమాండర్లను మట్టుబెడుతున్నట్లు ఇజ్రాయెల్ మిలిటరీ ప్రకటించింది. తాజాగా జరిపిన దాడుల్లో ఓ కీలక కమాండర్, ముగ్గురు సీనియర్ ఉగ్రవాదులు హతమైనట్లు వెల్లడించింది. నిఘా వర్గాల సమాచారం మేరకు.. తమ వైమానిక దాడిలో హమాస్‌లోని దరాజ్ తుఫా బెటాలియన్‌కు చెందిన ముగ్గురు కీలక ఆపరేటర్లు మృతిచెందినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. వారి ఫొటోలను కూడా ఎక్స్ వేదికగా విడుదల చేసింది. అక్టోబరు 7న ఇజ్రాయెల్‌లో హమాస్ జరిపిన మారణహోమంలో ఈ బెటాలియనే కీలక పాత్ర పోషించినట్లు పేర్కొంది. ఇది అత్యంత కీలక బ్రిగేడ్ అని తెలిపింది. ఇక, అంతకుముందు గురువారం ఉదయం జరిపిన వైమానిక దాడుల్లో హమాస్ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ డిప్యూటీ హెడ్ షాదీ బరూద్ మృతిచెందినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. అక్టోబరు 7 నాటి దాడి ప్లానింగ్‌లో ఇతడు కూడా భాగమైనట్లు పేర్కొంది.

**ఈజిప్టు నగరంలో కూలిన క్షిపణి..** ఇదిలా ఉండగా.. ఇజ్రాయెల్ - హమాస్ పోరు వేళ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఇజ్రాయెల్ సరిహద్దుల్లో ఉన్న ఓ ఈజిప్టు పట్టణంలో క్షిపణి కూలింది. సరిహద్దుల్లోని రెడ్ సీ రిసార్ట్ టౌన్‌లో గల ఓ వైద్యారోగ్య కేంద్రంపై ఈ క్షిపణి కూలినట్లు ఈజిప్టు మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ఘటనలో ఆరుగురు గాయపడినట్లు తెలిపాయి. ఈ ఘటన గురించి తమకు తెలిసిందని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) తెలిపింది. అయితే, ఈ క్షిపణి ఎక్కడి నుంచి వచ్చిందనేదానిపై మాత్రం స్పష్టమైన సమాచారం లేదు. ఇజ్రాయెల్ - హమాస్ పోరులో భాగంగానే ఈ క్షిపణిని ప్రయోగించారా? లేదా పొరబాటుగా జరిగిన ఘటననా? అనే దానిపై స్పష్టత లేదు.

**గాజాలో 7వేలు దాటిన మరణాలు..** మరోవైపు, ఇజ్రాయెల్ భీకర దాడులతో గాజాలో పౌరుల మరణాల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఇప్పటివరకు 7వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు గాజాలోని ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. గాయపడిన వారి సంఖ్య 10వేలకు పైనే ఉంది.

## హాట్ లుక్స్ లో హీటెక్కిస్తోన్న అవికా!

టాలీవుడ్ లో అవికాగోర్ వేగం తగ్గిన సంగతి తెలిసిందే. ఛాన్సులు వస్తే చేయడం లేదంటే? ఇతర భాషల్లో సినిమాలు చేయడం తప్ప! అవికా కోసమంటూ అవకాశాలు లేవిక్కడ. ఈ ఏడాది పాప్ కార్న్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆ సినిమా వైఫల్యం తర్వాత అమ్మడు తెలుగులో కనిపించలేదు. చెన్నై..ముంబై అంటూ కొత్త అవకాశాల కోసం చక్కెర్లు కొడుతుంది. అలాగే అమ్మడు సోషల్ మీడియాలో కూడా పెద్దగా యాక్టివ్ గా ఉండదు. గ్లామర్ పాత్రల వైపు తొలి నుంచి అనాసక్తిగా ఉండే బ్యూటీ కాబట్టి సోషల్ మీడియాలో హీటెక్కించే ఫోటోలతో ట్రీట్ అన్నది ఊహించనది. ఆ మధ్య కాస్త స్కిన్ షో చేస్తుందని ప్రచారం ఊపందుకుంది. కానీ ఆ తర్వాత ఆ వేగాన్ని కొనసాగించలేదు. అవకాశాల కోసం పంథా మార్చుకోవడం దేనికి వస్తే చేస్తాం.. లేకపోతే ఇంట్లో కూర్చుంటాం అన్న తీరున



కనిపించింది. తాజాగా అమ్మడు ఒళ్లంతా కప్పేసుకున్న ఓ ఫోటో నెట్టింట దర్శనమించ్చింది. క్రీమ్ కలర్ షోల్డర్ డిజైన్ లో అమ్మడు వయ్యారంగా కెమెరాకి ఫోజులిచ్చింది. ఇందులో ఎద అందాలు హైలైట్ చేసింది. అదీ వైడ్ యాంగిల్ లో. కెమెరా కోసం ప్రత్యేకంగా ఇచ్చిన ఫోజు అది. ఇక అమ్మడి హాట్ లుక్స్ మాత్రం కుర్రాళ్లకి మత్తెక్కించడం ఖాయమే. చూపులతోనే వలపు బాణం విసిరేస్తోంది. కళ్లలోనే కావాల్సినంత స్టఫ్ ఉందనిపిస్తుంది. ముఖానికి లైట్ మ్యాకప్.. పెదాలకు లిప్ స్టిక్ పూసింది. అయితే అమ్మడు ఎంపిక చేసుకున్న చెవి బుట్టలు మాత్రం ఆమెని మరింత అందంగా తీర్చిదిద్దాయి. ఇలా ఎంత ముస్తాబైనా షరా మాములుగా చబ్బీలుక్ మాత్ర అలాగే హైలైట్ అవుతుంది. మునుపటి కన్నా ముఖంలో గ్లోనెస్ తగ్గింది. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. అవికా అభిమానులు తమదైన శైలిలో కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు.

## సామ్ బ్రేక్.. ఎంత ఆదాయం పోతుందో తెలుసా?

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత గురించి తెలియనివారు ఎవరూ ఉండరేమో. ఆమె దాదాపు దశాబ్దానికి పైగా సినిమాలు చేస్తూ, దక్షిణాది ప్రజలను అలరిస్తూ వస్తున్నారు. ఆమెకు రోజు రోజుకీ క్రేజ్ పెరుగుతుందే కానీ, తగ్గుతున్నది లేదు. ముఖ్యంగా, ది ఫ్యామిలీ మ్యాన్ వెబ్‌సిరీస్‌లో తన నటనతో జాతీయ దృష్టిని ఆకర్షించినప్పటి నుండి సమంత క్రేజ్ రోజు రోజుకీ పెరిగిపోతోంది. అయితే, ఆమె తన అనారోగ్య కారణాల వల్ల సంవత్సరం పాటు సినిమాలకు బ్రేక్ ఇచ్చింది. చాలా మంది దర్శక నిర్మాతలు ఆమెతో సినిమాలు చేయాలని ఉత్సాహం చూపిస్తున్నా కూడా ఆమె మాత్రం సినిమాలు చేయడానికి అస్సలు సముఖతగా లేరు. ఆమె తన ఆరోగ్యం పూర్తిగా సెట్ అయ్యే



వరకు మళ్లీ ఎలాంటి సినిమా చేయాలని అనుకోవడం లేదు. అయితే, ఈ బ్రేక్ కి ముందు సమంత తన పారితోషకం పెంచేసింది. ఫ్యామిలీ మ్యాన్ 2 తర్వాత ఆమె తన రెమ్యూనరేషన్ ని రూ.10 కోట్లకు పెంచేసింది. ఆమె చివరగా ఖుషీ, సిటాడెల్ ల కోసం రూ.5 కోట్లు తీసుకుంది. అయితే, తాను ప్రస్తుతం సంవత్సరం పాటు బ్రేక్ తీసుకోవడంతో దాదాపు సమంత రూ30కోట్లు నష్టపోవాల్సి రావడం గమనార్హం. చేతిలో ఉన్న సినిమాలను వదులుకోవడంతో పాటు, ఆమె చేతిలో ఉన్న బ్రాండ్స్ కి కూడా దూరంగా ఉండే అవకాశం ఉంది. దీంతో, సమంత కేవలం ఒక్క సంవత్సరం గ్యాప్ తీసుకోవడం వల్ల రూ.30కోట్ల నష్టం వాటిల్లుతోందని తెలిసి ఫ్యాన్స్ షాకౌతున్నారు, అయితే, ఆమె ఆరోగ్యం కంటే, ఈ డబ్బు ఎక్కువ కాదు అని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా, సమంత మూవీలకు బ్రేక్ ఇచ్చినా, ఆమె క్రేజ్ మాత్రం బాగా పెరిగింది. ఓర్మాక్స్ సంస్థ నిర్వహించిన సర్వేలో సమంత ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఆమె అగ్ర తారలను వెనక్కి నెట్టి, మొదటి స్థానంలోకి చేరడం విశేషం. దేశంలోని స్టార్ల టాప్ ర్యాంకింగ్స్ ఇక్కడ ఉన్నాయి. వరుసగా సమంత (1) అలియా భట్ (2), దీపికా పదుకొణె (3), నయనతార (4), కాజల్ అగర్వాల్ (5) ఉన్నారు. టాప్ 10 జాబితాలో త్రిష (6), కత్రినా కైఫ్ (7), కియారా అద్వానీ (8), కీర్తి సురేష్ (9), రష్మిక మందన్న (10) చోటు దక్కించుకోవడం విశేషం.




## “రోజా” మీద ఒట్టు... ఈమె వయసు 54 ఏళ్లు!





కొంతమంది మగాళ్లకు వయసుతో సంబంధం ఉండదు... ఎంత వయసు వచ్చినా చాలా ఫిట్ గా, యాక్టివ్ గా కనిపిస్తారు. ఇక మహిళల విషయానికొస్తే... కొంతమందిని చూస్తే వీళ్ల వయసు రివర్స్ లో వెళ్తుందేమో అనిపిస్తుంటుంది. వయసు పెరిగే కొద్దీ వీరి అందం పెరుగుతుంటుంది. వారికి వారుగా చెబితే తప్ప వారి వయసు తెలుసుకోవడం పెద్ద టాస్కే! అలాంటి అతితక్కువమంది హీరోయిన్స్ లో ఒకరు మధుబాల! అవును... హాఫ్ సెంచరీ దాటినా కూడా ఎక్కడా ఆ తాలూకు లక్షణాలు కనిపించకుండా.. ఫిట్ గా ఉంటూ, అందానికి అసూయ కలిగించేలా కనిపిస్తున్నారు మధుబాల.

తాజాగా ఒక ఈవెంట్ కు హాజరైన ఆమెను చూసిన కెమెరాలకు సైతం కన్ను కుట్టిందని చెప్పినా అతిశయోక్తి కాదేమో! ఆ లెవెల్ లో కనిపించారు మధుబాల.! సపోజ్ ఎవరైనా మధుబాలను చూడటం ఇదే ఫస్ట్ టైం అయితే... కచ్చితంగా ఆకర్షణలో పడతారనడంలో సందేహం ఉండకపోవచ్చు!! కాగా... మధుబాల 90వ దశకంలో పాపులర్ నటి అనే విషయం తెలిసిందే. 1991లో కె బాలచందర్ దర్శకత్వం వహించిన “అళగన్” సినిమాతో సినిమాఇండస్ట్రీ ఎంట్రీ ఇచ్చిన మధుబాల.. ఆ తర్వాత మణిరత్నం తీసిన “రోజా” సినిమాలో తన అద్భుతమైన నటన, చూపు తిప్పుకోనివ్వని సొగసుతో మెస్మరైజ్ చేసింది. ఆ సినిమాలో పాటలు ఇప్పటికీ టీవీలో వస్తుంటే... ఆమె కోసం రిమోట్ పక్కన పెట్టేవారు ఎంతో మది!! ఇలా... తమిళం, తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో ఆమె ఎన్నో సినిమాలు చేశారు. తెలుగులో అల్లరి ప్రియుడు, ఆవేశం, చిలక్కొట్టుడు, గణష్, జెంటిల్ మెన్ చిత్రాల్లోనూ తనదైన అందం, నటనతో మధు అధరగొట్టారు. ఇక సెకండ్ ఇన్నింగ్స్ లో తెలుగులో “నిఖిల్ - సూర్య వర్సెస్ సూర్య”, “ఎన్టీఆర్ - నాన్నకు ప్రేమతో”, “ప్రేమదేశం” సినిమాలో నటించారు మధుబాల! ఇక తమిళనాడుకు చెందిన మధుబాలకు అప్పట్లో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉండేది. ముఖ్యంగా రోజా సినిమాలో కాశ్మీర్ అందాల మధ్యలో.. “పరువం వానగా నేడు కురిసేనులే...” అనే పాటలో ఆమెను చూసిన కుర్రకారు ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపారన్నా అతిశయోక్తి కాదు! ఆ రేంజ్ లో ఫాలోయింగ్ ఉన్న మధుబాల.... ప్రముఖ నటిమణులు హేమా మాలిని, జూహీ చావ్లాలకు బంధువైన ఆనంద్ షాను 1999 ఫిబ్రవరి 19న వివాహం చేసుకున్నారు.

వీరికి అమెయా, కెయా అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వివాహానంతరం కెరీర్ లో స్వల్ప విరామం తీసుకున్న మధుబాల.. సెకండ్ ఇన్నింగ్స్ లో భాగంగా తల్లి పాత్రలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి! ఈ ఫోటోలు చూస్తున్న సీనియర్స్.. ఒకసారి ఫ్లాష్ బ్యాక్ కి వెళ్తున్నారు!

## మాస్ రాజాకి జోడీగా బుట్టబొమ్మని సెట్ చేస్తున్నారా?





మాస్ మహారాజా రవితేజ సినిమాల్లో హీరోయిన్లు మాత్రం అతని ఇమేజ్కి ఏమాత్రం తగ్గకుండా ఉంటారు. ఆయన ఏ సినిమా చేసినా ట్రెండింగ్ లో ఉన్న భామలు తప్పనసరిగా ఉండాలి. కొత్త వాళ్లతో రిస్క్ తీసుకోవడం కన్నా..సక్సెస్ అయిన బ్యూటీలైతే మార్కెట్ పరంగానూ పనికొస్తారన్నది ఓ ప్లాన్.

అందుకే రవితేజ సినిమాల్లో వీలైనంత వరకూ ఫేమస్ అయిన బ్యూటీలే ఉంటారు. తాజాగా ఇటీవలే గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రాజా మరో సినిమాకి కమిట్ అయి సంగతి తెలిసిందే. వరుసగా షూటింగ్ లతో బిజీగా ఉన్న కొత్త ప్రాజెక్ట్ ల విషయంలోనూ రాజా ఏమాత్రం తగ్గలేదు.

ఓ సినిమా సెట్ లో ఉండగా మరో ప్రాజెక్ట్ ని పట్టాలెక్కిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గోపీచంద్ మలినేని తో ప్రాజెక్ట్ ప్రకటించి సర్ ప్రైజ్ చేసారు. తాజాగా ఈప్రాజెక్ట్ ప్రీ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా అప్పుడే హీరోయిన్ ఎంపికపై కసరత్తులు మొదలు పెట్టారు. రాజా సరసన బుట్టబొమ్మ పూజాహెగ్డేని సెట్ చేసే దిశగా చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ పక్కా మాస్ కథలో పూజా అయితే పర్ఫెక్ట్ గా సెట్ అవుతుందని టీమ్ భావిస్తుందిట. దీనిలో భాగంగా ఇటీవలే ముంబైలో పూజని సంప్రదించినట్లు తెలిసింది. అన్ని కుదిరితే గనుక మాస్ రాజాతో బుట్టబొమ్మ రొమాన్స్ ఆస్వాదించొచ్చు. అయితే పూజాహెగ్డేని లాక్ చేయడం అన్నది అంత ఈజీ కాదు. డేట్లు సర్దుబాటు చేయలేని కారణంగా మహేష్ సినిమా ‘గుంటూరు కారం’లాంటి సినిమానే వదులుకుంది. అలాగే సినిమాలో ఆమె పాత్ర కూడా నచ్చాలి. పాటలు..రొమాన్స్ అంటే ఆమెతో కుదరదు. నటనకు ఆస్కారం ఉండాలి. సాధారణంగా రవితేజ సినిమాల్లో హీరోయిన్లకు అంత స్కోప్ ఉండదు. అందులోనూ గోపీచంద్ లాంటి మేకర్ హీరోయిన్ల పాత్రల్ని చాలా పరిమితంగానే రాస్తారు. అయితే తాజా ప్రాజెక్ట్ లో అలాంటి లోటు పాటులను సరిదిద్దుకుని పూజని మెప్పించగల్గితే ఆమె లాక్ అయ్యే ఛాన్సెస్ ఉన్నాయి. అలాగే పూజాహెగ్డే కొన్ని నెలలుగా తెలుగు సినిమాలకన్నా హిందీ సినిమాలపై ఎక్కువగా ఆసక్తి చూపిస్తోన్న సంగతి తెలిసిందే.

## జెనిలియాని మనోళ్లు అంత మాట అన్నారా?

దక్షిణాది అభిమానులు హీరోయిన్లను ఎలా ఆదరిస్తారో చెప్పాల్సిన పనిలేదు. రాష్ట్రం..భాషతో సంబంధం లేకుండా తెరపై కనిపిస్తే చాలు గుండెల్లో పెట్టుకుని ఆరాదిస్తారు. హీరోయిన్లకు అవకాశాల రావడం వెనుక ప్రధాన కారణం కేవలం ఫాలోయింగ్ మాత్రమే. అది ఎలా సాద్యమైంది అంటే అభిమానం చూపించడం వల్లే సాధ్యమైంది. తెరపై కనిపించిన ప్రతీ ఒక్కరినీ అదరించడం అన్నది సౌత్ లో ఉన్న ప్రత్యేకత. అందులోనూ తెలుగు రాష్ట్రాల్లో అదే అభిమానం మరింత ఎక్కువగా కనిపిస్తుంది. నటుడు..నటి నచ్చారంటే? తమ బిడ్డల్లాగే ఆదరించేంత అభిమానం తెలుగు రాష్ట్రాల్ని మించి ఎక్కడా కనిపించదు. దినదినాన అభమానం పెరుగుతుందే తప్ప! తగ్గుతుంది అన్న సన్నివేశం ఎక్కడా చోటు చేసుకోలేదు.అందులోనూ జెనిలియాని తెలుగు అభిమానులు ఎంతగా



ఆదరించారో తెలిసిందే. బొమ్మరిల్లు ఎంతో మంది హృదయాల్లో ఇల్లు కట్టిన అమ్మడికి ఇక్కడ ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఉంది. జెనిలియా అంతే హైహార్ట్ ఫ్యాన్స్ ఎంతో మంది ఉన్నారు. టాలీవుడ్ లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అలాంటి అభిమానం పై జెనిలియా నీళ్లు జల్లేసింది. దక్షిణాది నటీనటులకు నమ్మకమైన అభిమానులుంటారు. కానీ నేను తెలుగు..తమిళ..మలయాళ భాషల్లో నటిస్తున్నప్పుడు బాలీవుడ్ నుంచి వచ్చి దక్షిణాది సినిమాలు చేస్తుంది అనేవారు. ఎక్కడో నాపై చిన్న చూపు చూపించినట్లు అనిపించేది. భాషా బేధం చూపించినట్లు నా మనసుకు చాలా సందర్భాల్లో అనిపించింది. అయినా సరే నాకు ఆ భాషల్లో సినిమాలు చేయడం ఇష్టం. ఇప్పటివరకూ ఎన్నో సినిమాలు చేసాను. వాళ్ల నుంచి ఎంతో నేర్చుకున్నాను.ఏ భాషలో సినిమాలు రిలీజ్ అయిన వాటిని భారతీయ చిత్రాలుగానే పరిగణిస్తాను. నాకు మాత్రం ఎలాంటి బేధాభిప్రాయాలు లేవు. అందర్నీ సమానంగా చూడటమే తెలుసంటూ చురకలు వేసింది. మరి జెనీలియాకి సౌత్ అభిమానులు అంతగా ఏ సందర్భంలో నొప్పించారో. టాలీవుడ్ నుంచి బాలీవుడ్ కి వెళ్లిన తర్వాత జెనిలియా కొన్నాళ్లకి నటుడు రితేష్ దేశ్ ముఖ్ ని ప్రేమించి పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు కలరు.

## పూజా హెగ్డే మళ్ళీ లైన్ లోకి వచ్చినట్లేనా?

టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్గా తనకంటూ ప్రత్యేకమైన బ్రాండ్ క్రియేట్ చేసుకున్న అందాల భామ పూజ హెగ్డే. ముకుంద సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఈ చిన్నది దువ్వాడ జగన్నాథమ్ మూవీతో బ్లాక్ బాస్టర్ అందుకొని స్టార్ హీరోయిన్ రేస్ లోకి వచ్చింది. తర్వాత వరుసగా పెద్ద హీరోలతో సినిమాలు చేస్తూ కమర్షియల్ హీరోయిన్ గా తన సక్సెస్ ని కొనసాగించింది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన అరవింద సమేత, అల వైకుంఠపురంలో సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ బ్లాక్ బస్టర్ హిట్స్ ని పూజా హెగ్డే తన ఖాతాలో వేసుకుంది. తమిళంలో ఇళయ దళపతి విజయ్ హీరోగా తెరకెక్కిన బీస్ట్ చిత్రంలో కూడా హీరోయిన్ గా నటించిన సక్సెస్ అందుకుంది. అయితే హిందీలో మాత్రం ఆమెకు ఆశించిన స్థాయిలో సక్సెస్ రావడం లేదని చెప్పాలి. రణవీర్ సింగ్ కి జోడిగా నటించిన సర్కస్ మూవీ డిజాస్టర్ అయింది. సల్మాన్ ఖాన్ తో చేసిన కిసికి జాన్ కిసిక భాయ్ సినిమా కూడా ఫ్లాప్ జాబితాలో చేరిపోయింది. ఇదే సమయంలో తెలుగులో సూపర్ స్టార్ మహేష్ బాబుకి జోడిగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో చేయాల్సిన గుంటూరు కారం సినిమా కాన్సెప్ట్ మారిపోవడంతో పూజా హెగ్డేని



పక్కన పెట్టారు. ఆమె స్థానంలో శ్రీలీలని ఎంపిక చేశారు. హరీష్ శంకర్ దర్శకత్వంలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కి జోడిగా చేయాల్సిన ఉస్తాద్ భగత్ సింగ్ మూవీ చాన్స్ కూడా మిస్ అయింది. ఇక్కడ కూడా పూజా హెగ్డే ప్లేస్ ని శ్రీలీల రీప్లేస్ చేసింది. ఇలా రెండు పెద్ద హీరోల సినిమాలను పూజా హెగ్డే మిస్ చేసుకోవడం వరుస ఫ్లాప్ లతో సతమతం అవుతూ ఉండడంతో కెరియర్ పరంగా డోలమానంలో పడింది. ఇప్పుడు మరలా వరుస ప్రాజెక్టులతో పూజ హెగ్డే బిజీ కావడానికి రెడీ అవుతున్నట్లు తెలుస్తుంది. రెమ్యూనరేషన్ ఎక్కువ డిమాండ్ చేయడంతో పవన్ కళ్యాణ్, మహేష్ బాబు సినిమాలలో అవకాశాలను పూజ హెగ్డే కోల్పోయింది అనే ప్రచారం ఉంది. ప్రస్తుతం మరో మెగా హీరో సాయిధరమ్ తేజ్, సంపత్ నంది కాంబినేషన్ లో తెరకెక్కపోయే మాస్క్ కమర్షియల్ సినిమాలో హీరోయిన్ గా పూజ హెగ్డేని ఫైనల్ చేశారంట. అలాగే మాస్ మహారాజ్ రవితేజ, గోపీచంద్ కాంబినేషన్ లో రాబోయే నాలుగో చిత్రంలో పూజ హెగ్డేని హీరోయిన్ గా ఖరారు చేసినట్లు తెలుస్తుంది. వీటితోపాటు తమిళంలో కార్తీ, లింగస్వామి కాంబినేషన్ లో తెరకెక్కబోయే పయ్యాన్ 2 మూవీలో కూడా హీరోయిన్ గా ఫిక్స్ అయ్యింది.




పాలేరు: భక్తరామదాసు ప్రాజెక్టు, రైతు బంధు, రైతు బీమా, 24 గంటల కరెంటు వచ్చిన తర్వాత పాలేరులో రైతులు సంతోషంగా ఉన్నారని సీఎం కేసీఆర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖమ్మం జిల్లా పాలేరులో నిర్వహించిన భారాస ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "సీఎం కేసీఆర్ వల్లే పాలేరుకు మోక్షం వచ్చిందని మాట్లాడిన నాయకులు నేడు ఉల్టా మాట్లాడుతున్నారు. నిజం నిప్పులాంటిది.. సత్యం మారదు. తాండాలను ఎవరు పంచాయతీలుగా మార్చారో మీకు తెలుసు. పాలేరు నియోజకవర్గంలో భక్తరామదాసు ప్రాజెక్టు కట్టకముందు భూముల ధర ఎంత? ఇప్పుడు ఎంత?ఇది ఎవరి పుణ్యమో ఆలోచించాలి. పార్టీల వైఖరి ఏంటో తెలుసుకుని ఓటు వేయాలి.

**రైతు బంధు, దళిత బంధు ఉండాలా?వద్దా?..** పదవుల కోసం అనేక మంది పార్టీలు మారతారు.. మాట మారుస్తారు. పూటకో పార్టీ మారే వారిని నమ్మొద్దు. డబ్బు సంచులతో వచ్చే వారిని కాదు.. సర్వజనుల సంక్షేమం కోసం పనిచేసిన వారిని గెలిపించాలి. అప్పుడే ప్రజలకు మేలు జరుగుతుంది. విజ్ఞతతో ఆలోచించాలని పాలేరు ప్రజలను కోరుతున్నా. రైతు బంధు పథకాన్ని ఐక్యరాజ్య సమితి, వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ వంటి వారు ప్రశంసించారు. గతంలో ఏ పాలకులూ రైతులకు రూపాయి ఇవ్వలేదు. ధాన్యం దిగుబడిలో పంజాబ్ తర్వాతి స్థానానికి చేరుకున్నాం. తెలంగాణ రైతులు 3 కోట్ల టన్నుల ధాన్యం పండిస్తున్నారు. రాష్ట్ర సంపద పెరుగుతున్న కొద్దీ.. సంక్షేమ పథకాలు పెంచుకుంటూ పోతున్నాం. పొరపాటున కాంగ్రెస్ గెలిస్తే రైతు బంధు, దళితబంధు ఉండవు. రైతు బంధు, దళిత బంధు ఉండాలో?వద్దో? ప్రజలే నిర్ణయించుకోవాలి.

**తుమ్మలే భారాసకు అన్యాయం చేశారు...** కేసీఆర్ అన్యాయం చేశానని తుమ్మల నాగేశ్వరరావు ప్రచారం చేస్తున్నారు. ఖమ్మంలో పువ్వాడ అజయ్ మీద ఓడిపోయిన తుమ్మల.. మూలకు కూర్చుంటే, భారాస ప్రభుత్వం వచ్చిన తర్వాత పాత స్నేహితుడనే ఉద్దేశంతో ఓడిపోయిన వ్యక్తిని పిలిచి మంత్రి పదవి ఇచ్చా. ఎమ్మెల్సీని చేశా. ఆ తర్వాత పాలేరు ఉప ఎన్నిక వస్తే టికెట్ ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించాం. ఐదేళ్లు ఖమ్మం జిల్లా మీద ఏకఛత్రాధిపత్యం ఇస్తే.. ఆయన చేసింది గుండు సున్నా. ఖమ్మం జిల్లాలో ఒక సీటు రాకుండా చేశారు. ద్రోహం చేసింది ఎవరు? భారాస తుమ్మలకు అన్యాయం చేసిందా? తుమ్మల.. భారాసకు అన్యాయం చేశారా? న్యాయం చెప్పాలింది మీరే. ఇదంతా మీ కళ్ల ముందు జరిగిన చరిత్ర. ఇప్పుడొచ్చి భారాస నేతలపై అడ్డగోలుగా మాట్లాడటం అరాచకం.

ఈ అరాచక రాజకీయ నాయకులకు బుద్ధి చెప్పాల్సిన బాధ్యత మీపైనే ఉంది" అని సీఎం కేసీఆర్ అన్నారు.

## దేశ ప్రతిష్టలు కాపాడటంలో పోలీస్ వ్యవస్థ రోల్ చాలా కీలకం




హైదరాబాద్: దేశ ప్రతిష్టలు కాపాడంలో పోలీస్ వ్యవస్థ రోల్ చాలా కీలకమైందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. శుక్రవారం నేషనల్ పోలీస్ అకాడమీలో నూతన ఐపీఎస్‌ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన ఐపీఎస్‌ల నుంచి గౌరవందనం స్వీకరించారు. అనంతరం కేంద్ర హోంమంత్రి మాట్లాడుతూ.. దేశ అత్యున్నత కోసం ఐపీఎస్‌లు పాటుపడాలన్నారు. దేశానికి సేవ అందించడంలో ఐపీఎస్‌లు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని తెలిపారు. పీడిత ప్రజల అభ్యున్నతి వారి భద్రత కోసం ఐపీఎస్‌లు నిబద్దతతో కృషి చేయాలని సూచించారు.

75వ బ్యాచ్ ఐపీఎస్ శిక్షణలో 33 మంది మహిళా ఐపీఎస్‌లు ఉండడం సంతోషం, గర్వకారణమని కొనియాడారు. సైబర్ నేరాల అదుపు, నేరగాళ్లకు చెక్ పెట్టడంలోనూ టెక్నాలజీపై ఐపీఎస్‌లు దృష్టి కేంద్రీకరించాలని కేంద్రమంత్రి తెలిపారు. నక్సలిజం, టెర్రరిజం వాటిపై ఐపీఎస్‌లు శిక్షణ తీసుకుని శుసిక్తులు అయ్యారన్నారు. భవిష్యత్‌లో ఎదురయ్యే ఎన్నో సవాళ్ళను ఐపీఎస్‌లు అలవోకగా ఎదురుకోవాలని చెప్పారు. అర్గనేనింగ్ క్రైమ్, సైబర్ క్రైమ్ క్రిప్తో కరెన్సీ, హవాలా చలామణి, నకిలీ నోట్ల చలామణి, గ్రేహౌండ్, నార్కోటిక్స్, ఇంటర్ స్టేట్ గ్యాంగ్, చార్జిషీట్ ఫైల్, ఫోరెన్సిక్ సైన్స్ అన్ని అంశాలపై ఐపీఎస్‌లు పట్టు సాధించాలని అన్నారు. న్యాయ వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా క్రిమినల్ జస్టిస్‌పై దృష్టి కేంద్రీకరించాలన్నారు. దేశ ప్రధాన మంత్రి మోడీ నేతృత్వంలో సంకల్పంతో అన్ని రంగాల్లో ముందుకెళ్తోందన్నారు.

అంతిమంగా ఐపీఎస్‌లు ప్రజల భద్రత అందించడంలో మనసులు గెలవాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పేర్కొన్నారు.




హైదరాబాద్: తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర రైతాంగాన్ని ఉద్దేశిస్తూ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, కర్ణాటకలో కాంగ్రెస్ అమలు చేస్తున్న రైతు సంక్షేమాలను బేరీజు వేస్తూ.. ఏది కావాలో ఎంచుకోవాలని సూచించారు. "కేసీఆర్ ఇస్తున్న 24గంటల విద్యుత్ కావాలా? కర్ణాటకలో కాంగ్రెస్ ఇస్తున్న 5గంటల విద్యుత్ కావాలా? లేక తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చెప్పిన 3 గంటల విద్యుత్ కావాలా? రైతుబంధు, రైతుబీమా ఇచ్చి ప్రాజెక్టులు కట్టిన కేసీఆర్ కావాలా?ఆరు దశాబ్దాలు ఆగం చేసిన వాళ్లు కావాలా? నెర్రెలు బారిన నేలను సస్యశ్యామలం చేసిన కేసీఆర్ కావాలా? ఏది కావాలి మనకు? ఆలోచించు రైతన్నా?" అని కేటీఆర్ పేర్కొన్నారు.




దిల్లీ: తెలంగాణ కాంగ్రెస్ అభ్యర్థుల రెండో జాబితా విడుదలైంది. 45 మందితో రెండో జాబితాను ఆ పార్టీ శుక్రవారం సాయంత్రం విడుదల చేసింది. 55 మందితో ఇటీవల తొలి జాబితాను ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఇప్పటి వరకు ప్రకటించిన అభ్యర్థుల సంఖ్య వందకు చేరింది. ఇంకా 19 నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. గద్దర్ కుమార్తె జీవీ వెన్నెలకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీటు కేటాయించింది. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి కి రెండో జాబితాలో అవకాశం కల్పించారు.

సిర్పూర్ – రావి శ్రీనివాస్, అసిఫాబాద్ (ఎస్టీ) – అజ్మీరా శ్యామ్, ఖానాపూర్ (ఎస్టీ) – వెడ్మర బొజ్జు, ఆదిలాబాద్– కంది శ్రీనివాస్ రెడ్డి, బోథ్ (ఎస్టీ) – వెన్నెల అశోక్, ముథోల్ – బోస్లె నారాయణరావు పాటిల్, ఎల్లారెడ్డి – కె.మదన్ మోహన్ రావు, నిజామాబాద్ రూరల్ – డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి, కోరుట్ల – జువ్వాది నర్సింగరావు, చొప్పదండి (ఎస్సీ) – మేడిపల్లి సత్యం, హుజురాబాద్ – వడితెల ప్రణవ్, హుస్నాబాద్ – పొన్నం ప్రభాకర్, సిద్ధిపేట: పూజల హరికృష్ణ, నర్సాపూర్: ఆవుల రాజిరెడ్డి, దుబ్బాక: చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, కూకట్‌పల్లి: బండి రమేష్, ఇబ్రహీంపట్నం: మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎల్బీనగర్: మధు యాష్కి గౌడ్, మహేశ్వరం: కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, రాజేంద్రనగర్: కస్తూరి నరేందర్, శేరిలింగంపల్లి: వి.జగదీశ్వర్ గౌడ్, తాండూర్: బయ్యని మనోహర్‌రెడ్డి, అంబర్‌పేట్: రోహిన్ రెడ్డి, ఖైరతాబాద్: పి.విజయారెడ్డి, జూబ్లీహిల్స్: మహ్మద్ అజహరుద్దీన్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ (ఎస్సీ) : డాక్టర్ జీవీ వెన్నెల, నారాయణపేట్– డా. పర్ణిక చిట్టెం రెడ్డి, మహబూబ్‌నగర్ – యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల – జె. అనిరుధ్ రెడ్డి, దేవరకద్ర – గావినోళ్ల మధుసూధన్ రెడ్డి, మక్తల్– వాకిటి శ్రీహరి, వనపర్తి– డా. జిల్లెల చిన్నారెడ్డి, దేవరకొండ (ఎస్టీ)– నేనావత్ బాలూ నాయక్, మునుగోడు – కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, భువనగిరి – కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జనగామ– కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పాలకుర్తి – యశస్విని, మహబూబాబాద్ (ఎస్టీ)– డా. మురళీ నాయక్, పరకాల – రేవూరి ప్రకాశ్ రెడ్డి, వరంగల్ పశ్చిమ – నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ తూర్పు – కొండా సురేఖ, వర్ధన్నపేట (ఎస్సీ)– కేఆర్ నాగరాజు, పినపాక (ఎస్టీ)– పాయం వెంకటేశ్వర్లు, ఖమ్మం – తుమ్మల నాగేశ్వరరావు, పాలేరు – పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

# మల్లారెడ్డి పాలనపై ప్రజలు విసిగిపోయి ఉన్నారు

## మేడ్చల్ లో కాంగ్రెస్ జెండా ఎగరం కాయం




షామీర్పేట్ : షామీర్పేట్ చెరువు శిఖం స్థలాన్ని రాళ్లు మట్టితో పూడిచి మర్రీ మంత్రి మల్లారెడ్డి కబ్జా చేశాడని, కాదని నిరూపించగలిగితే తను సవాలకు సిద్ధమన్న మేడ్చల్ శాసనసభ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం తూముకుంట మున్సిపాలిటీ. షామీర్పేట. మూడు చింతలపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మలిపెద్ది సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... మేడ్చల్ నియోజకవర్గంలో మంత్రి మల్లారెడ్డికి కాలేజీలు ఉన్నాయని, వాటిని కాపాడుకునేందుకు మాత్రమే మేడ్చల్ నుండి ఎమ్మెల్యే గా పోటీ చేసి గెలిచి మంత్రి పదవి పొందినప్పటికీ, మేడ్చల్ నియోజకవర్గానికి చేసింది ఏమి లేదంటూ ఆయన దుయ్యబట్టారు. ఇక కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ... గత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ జెండాను మోసిన కార్యకర్తల కష్టానికి, ఇప్పుడు మంచి కాలం వచ్చిందని ఈసారి రాష్ట్రంలో, కేంద్రంలో వచ్చేవి కాంగ్రెస్ ప్రభుత్వమేనని సుధీర్ రెడ్డి జోష్యం చెప్పారు. అయితే ఎలక్షన్స్ అయ్యేంతవరకు మాత్రం ప్రతి ఒక్క కార్యకర్త కాంగ్రెస్ పార్టీ ప్రకటించే మేనిఫెస్టోని ప్రజలకు తీసుకెళ్లాలని కాంగ్రెస్ కార్యకర్తలకు సుధీర్ రెడ్డి సూచించారు. అంతేకాకుండా కాంగ్రెస్ మేనిఫెస్టోను ని బిఆర్ఎస్ పార్టీ కాపీ కొట్టిందని ఆయన ఆరోపించారు. అనంతరం మేడ్చల్ శాసనసభ కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ... దళితులకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు రాలేవని, దళిత బంధు పథకం కేవలం మంత్రి అనుచర్లకే లభిస్తుందంటూ ఆరోపించారు. అంతేకాకుండా 100 ఎకరాల మేర భూమిని అప్పనంగా మంత్రి మల్లారెడ్డి కజేసరంటు తీవ్రంగా ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీని ఇంటికి పంపేందుకు ప్రజల సిద్ధమయ్యారు అన్నారు. ఇక నక్క ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ ఈసారి తోటకూర వజ్రెష్ యాదవ్ గెలుపు ఖాయమని ఆయన అన్నారు. మల్లారెడ్డికి డిపాజిట్ కూడా దక్కదన్నారు. ఈ 30 రోజులు కార్యకర్తలు నాయకులంతా కలిసి పనిచేసి వజ్రేష్ యాదవ్ ని గెలిపించాలని నక్క ప్రభాకర్ గౌడ్ కోరారు. మేడ్చల్ నియోజకవర్గం ప్రజలకు ఎటువంటి కష్టం వచ్చినా ముందుండే ఆదుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

మల్లారెడ్డి ని ఓడించి మేడ్చల్ నుండి తన నివాసమైన బోయిన్పల్లి కి పంపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం చివర్లో కాంగ్రెస్ పార్టీలో పలువురు ఇతర పార్టీలకు చెందిన నాయకులు సైతం చేరడంతో కాంగ్రెస్ పార్టీలో మరింత ఊపు వచ్చిందని చెప్పాలి. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు రాపోలు రాములు, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మేడి మల్లేష్, మూడ్చింతలపల్లి మండల కమిటీ అధ్యక్షుడు బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, కౌన్సిలర్ సింగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, తూముకుంట మున్సిపల్ కాంగ్రెస్ ప్రచార కమిటీ అధ్యక్షుడు రామచందర్ తదితరులు పాల్గొన్నారు.




## తప్పు చేశా.. సరిదిద్దుకునేందుకే కాంగ్రెస్‌లో చేరుతున్నా

న్యూఢిల్లీ: మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. గత రాత్రి కాంగ్రెస్ నేత మాణిక్‌రావు ఠాక్రే సమక్షంలో హస్తం పార్టీలో చేరారు. తిరిగి ఈరోజు (శుక్రవారం) ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేతో మరోసారి పార్టీ కండువా కప్పుకున్నారు.ఇందులో భాగంగా కాసేపట్టి క్రితమే కోమటిరెడ్డి ఏఐసీసీ కార్యాలయానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. "నేను తప్పు చేశా, సరిదిద్దుకునేందుకే తిరిగి కాంగ్రెస్‌లో చేరుతున్న. కేసీఆర్‌ను ఓడించడమే నా ఏకైక లక్ష్యం, బీజేపీలోకి వెళ్లిన, కాంగ్రెసులోచేరినా కేసీఆర్‌ను గద్దె దించేందుకే. కేసీఆర్ అవినీతిపై బీజేపీ చర్యలు తీసుకుంటుందనే ఆ పార్టీలో చేరా. చర్యలు లేనందునే బయటకు వచ్చా. బీజేపీలో నాకు గౌరవం, ప్రాధాన్యత ఇచ్చారు. కానీ నా లక్ష్యం నెరవేరలేదు. హంగ్ వస్తే బీజేపీ, ఎంఐఎం ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తారు. బీజేపీకి ఓటు వేస్తే బీఆర్ఎస్‌కు ఓటు వేసినట్లే. ప్రజలు నేను కాంగ్రెస్‌లో రావాలని కోరుకుంటున్నారు. సర్వేల్లో నాకే అనుకూలంగా ఉన్నాయి. కేసీఆర్ ధన, అధికార మదంతో మాట్లాడుతున్నాడు. అవినీతి సొమ్ముతో ప్రధాని కావాలని ఇండియా కూటమికి నిధులు సమకూరుస్తానంటూ ఆఫర్ ఇచ్చాడు. ఈరోజు కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశం ఉదయాన్నే ఉన్నందున రాత్రి మాణిక్ రావు ఠాక్రే సమక్షంలో కండువా కప్పుకున్నాను. ఇప్పుడు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేతో మరోసారి కండువా కప్పించుకుంటాను" అని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. కాగా.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు తెలంగాణ కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు జరుగుతున్నాయి. మాజీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఏనుగు రవీందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు, సంతోష్ కుమార్, నేతి విద్యాసాగర్, ఆకుల లలిత, కపిలవాయి దిలీప్ కుమార్, మోత్కుపల్లి నర్సింహులు ఇప్పటికే ఏఐసీసీ కార్యాలయానికి చేరుకున్నారు. మరికాసేపట్లో కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే సమక్షంలో నేతలు పార్టీలో చేరనున్నారు.




దిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీలోకి పెద్ద సంఖ్యలో నేతల వలసలు పెరుగుతున్నాయి. దీంతో ఆ పార్టీలో ఉత్సాహం నెలకొంది. ఇటీవల భాజపా, భారాసకు చెందిన పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరగా.. తాజాగా మరికొందరు సీనియర్ రాజకీయ నేతలు హస్తం గూటికి చేరారు. శుక్రవారం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ఎమ్మెల్సీ ఆకుల లలిత, మాజీ ఎమ్మెల్సీలు నేతి విద్యాసాగర్, కపిలవాయి దిలీప్ కుమార్‌తో పాటు పటాన్‌చెరుకు చెందిన భారాస నేత నీలం మధు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ ఖర్గే కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. మరోవైపు, మనుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్ గురువారం రాత్రి మాణిక్ రావ్ ఠాక్రే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. దిల్లీలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల వేళ వీరి చేరిక తమ పార్టీకి ఎంతో బలాన్నిస్తుందని, తెలంగాణ ప్రజలు భారాస అవినీతి పాలనను తిరస్కరిస్తున్నారంటూ కాంగ్రెస్ 'ఎక్స్'లో పేర్కొంది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com